# బాసరలో అర్ధరాత్రి దొంగల బీభత్సం

మహంకాళి అమ్మవారి ఆలయంలో చోరీ
వెండి కిరీటం, హుండీతో పరారీ
వ్యాసగుడి వద్ద ఖాళీ హుండీ లభ్యం
నిత్య పూజల వేళ వెలుగులోకి ఘటన
సీసీటీవీ, క్లూస్ టీమ్స్ ఆధారంగా విచారణ
03




వాస్తవాలు పలుకు DD9 వార్త
TGTEL/26/A2635
తెలుగు దినపత్రిక






హైదరాబాద్ | సంపుటి: 01 | సంచిక: 42 | 24-06-2026 బుధవారం | పేజీలు: 08 | వెల: 3/-


## కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు సహకరించండి

రామ్మోహన్ నాయుడితో మంత్రి తుమ్మల భేటీ
గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుపై కీలక చర్చలు
కొత్త స్థలంలో ఫీజిబులిటీ సర్వే ప్రతిపాదన
త్వరగా సర్వే పూర్తి చేయాలని విజ్ఞప్తి
రాష్ట్ర ప్రభుత్వ కొత్త ప్రతిపాదనపై చర్చ
భద్రాచలం ప్రాధాన్యాన్ని వివరించిన తుమ్మల
పర్యాటకం, ఆర్థికాభివృద్ధికి ఎయిర్‌పోర్టు అవసరమన్న మంత్రి
కేంద్ర సహకారం కోరిన తెలంగాణ ప్రభుత్వం



న్యూఢిల్లీ, (డిడి9 వార్త): కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడిని తెలంగాణ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలిసి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణంపై చర్చించారు. కొత్తగూడెం వద్ద గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం గతంలో మిగతా 2లో..

## 'రైతు ఆశీర్వాద సభ' కాదు.. 'రైతు క్షమాపణ సభ' పెట్టుకోండి..!

కాంగ్రెస్ హామీలపై హరీష్ రావు ఫైర్
రైతుబంధు, రుణమాఫీపై విమర్శలు
'రైతు క్షమాపణ సభ'గా మార్చాలంటూ ఎద్దేవా
కేసీఆర్ పాలనను గుర్తుచేసిన హరీష్



హైదరాబాద్, (డిడి9 వార్త): రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలపై బీఆర్ఎస్ (BRS) సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీని మిగతా 2లో..

## ధాన్యం సేకరణ లక్ష్యాలు పెంచండి

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ఉత్తమ్ కుమార్ రెడ్డి లేఖ
రికార్డు స్థాయిలో 80.09 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ
తక్కువ లక్ష్యాల వల్ల రాష్ట్ర ఖజానాపై భారీ ఆర్థిక భారం
లక్ష్యాలకు మించి అదనంగా కొనుగోలు.. రూ.16,446 కోట్ల భారం
నిల్వ స్థలాల కొరతతో సీఎంఆర్ గడువు పొడిగింపు అత్యవసరం
కేంద్ర బియ్యం సేకరణ పరిమితిని 54.50 లక్షల టన్నులకు పెంచాలి
రైతు పండించిన ప్రతి గింజకూ మద్దతు ధర ఇచ్చి తీరుతాం



హైదరాబాద్, (డిడి9 వార్త): తెలంగాణ రైతుల ప్రయోజనాలను పరిరక్షించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత రబీ 202526 సీజన్‌లో రికార్డు స్థాయిలో వరి కొనుగోళ్లు జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోవాలని ఆయన కోరారు. వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా కేంద్రం తన ధాన్య సేకరణ లక్ష్యాలను పెంచాలని, అలాగే కస్టమ్ మిల్ల్ రైస్ (సీఎంఆర్) సరఫరా గడువులను పొడిగించాలని విజ్ఞప్తి చేస్తూ కేంద్ర వినియోగదారుల మిగతా 2లో..

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది

రేవంత్ కన్ను మెట్రో భూములపై పడిందన్న కేటీఆర్
సొంత మనుషులకు భూములు కట్టబెట్టేందుకే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపణ
రేవంత్, కిషన్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని ఆరోపణ



హైదరాబాద్, (డిడి9 వార్త): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డికి ఒక్కటే ఎజెండా ఉందని, అది మెట్రో భూముల స్కామ్ అని మండిపడ్డారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన కేటీఆర్, "రేవంత్ రెడ్డి కన్నంతా మెట్రో భూముల మీదే పడింది. ఏ స్కీమ్ తెచ్చినా దాని వెనుక ఒక స్కామ్ పక్కా ఉంటుంది" అని ఆరోపించారు.మెట్రో సమీపంలో 280 ఎకరాల విలువైన భూములు ఉన్నాయని, వీటి విలువ సుమారు రూ.30 వేల కోట్లు అని తెలిపారు. రేవంత్ రెడ్డి ఈ భూములను తన అన్నదమ్ములు, బావమరుదులు, అల్లుళ్లకు కట్టబెట్టడానికే మెట్రోను స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. దీని కోసం ప్రజలపై రూ.14 వేల కోట్ల భారం మోపారని విమర్శించారు."కేసీఆర్ ప్రభుత్వం 72 కిలోమీటర్ల మెట్రోను బ్రహ్మాండంగా మిగతా 2లో..

## ఏసీబీ వలలో ఎక్సైజ్ సూపరింటెండెంట్

ఆదాయానికి మించిన ఆస్తుల కేసు..
హైదరాబాద్‌తో పాటు 11 చోట్ల ఏకకాలంలో సోదాలు
తెల్లవారుజాము నుంచే మెరుపు దాడులు
హైదరాబాద్‌తో సహా బంధువుల ఇళ్లలో సోదాలు
గత ఆరేళ్లుగా నిజామాబాద్‌లోనే తిష్టవేసిన మల్లారెడ్డి
బ్యాంకు లావాదేవీల రికార్డులు లభ్యం.. బంగారం, నగదుపై ఆరా
నిజామాబాద్ నుంచి హైదరాబాద్ ఏసీబీ ఆఫీస్‌కు తరలింపు



హైదరాబాద్, (డిడి9 వార్త): అవినీతి నిరోధక శాఖ అధికారులు తెలంగాణలో మరో పెద్ద అవినీతి తిమింగలాన్ని పట్టుకున్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు భారీగా మిగతా 2లో..

## మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి హౌస్ అరెస్ట్

యూరియా యాప్ నిరసనకు వెళ్తుండగా అదుపులోకి..
యూరియా యాప్ రద్దుకు బీఆర్ఎస్ రైతు ధర్నా
ఎల్లారెడ్డి కార్యక్రమానికి ముందే పోలీసుల చర్య
ప్రశాంత్‌రెడ్డి గృహనిర్బంధంపై కేటీఆర్, హరీశ్‌రావు ఆగ్రహం
రైతుల గొంతు నొక్కే ప్రయత్నమని విమర్శ
యూరియా కొరతపై ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్
యాప్ విధానంతో రైతులకు తీవ్ర ఇబ్బందులని ఆరోపణ
ఫోన్‌లో మాట్లాడి సంఘీభావం తెలిపిన కేటీఆర్, హరీశ్‌రావు
పోలీసుల తీరుపై తీవ్ర అభ్యంతరం
రైతుల సమస్యలపై పోరాటం కొనసాగుతుందని స్పష్టం



హైదరాబాద్, (డిడి9 వార్త): యూరియా పంపిణీలో అమలవుతున్న యాప్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలో భారత రాష్ట్ర సమితి చేపట్టిన రైతు ధర్నాకు వెళ్లే క్రమంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని పోలీసులు మంగళవారం ఆయన బంజారాహిల్స్ నివాసంలో గృహనిర్బంధం చేశారు. దీంతో ఎల్లారెడ్డిలో చేపట్టాల్సిన ధర్నాకు ఆయన హాజరుకాలేకపోయారు. యూరియా కొరత, యాప్ విధానానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ రైతు ధర్నాకు పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రశాంత్‌రెడ్డి హైదరాబాద్ నుంచి బయలుదేరేందుకు సిద్ధమవుతుండగా మిగతా 2లో..

## ఖట్టర్‌తో సీఎం రేవంత్, కిషన్‌రెడ్డి కీలక భేటీ

హైదరాబాద్ మెట్రో రెండో దశపై విస్తృత చర్చలు
ఐఆర్ఎఫ్‌సీ రుణంపై కేంద్రంతో మంతనాలు
తెలంగాణ కీలక ప్రాజెక్టులకు సహకారం కోరిన రాష్ట్రం
నిధుల సమీకరణపై ప్రధానంగా చర్చించిన నేతలు
ఖట్టర్ నివాసంలో జరిగిన కీలక సమావేశం
అశ్వినీ వైష్ణవ్ పాల్గొనడంతో పెరిగిన ప్రాధాన్యం
మెట్రో విస్తరణ పనులపై కార్యాచరణ సమీక్ష
వరుసగా రెండో రోజు కేంద్ర మంత్రులతో సమావేశాలు
త్వరలోనే ప్రాజెక్టులకు స్పష్టత వచ్చే అవకాశం



హైదరాబాద్, (డిడి9 వార్త): తెలంగాణలో మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి సంయుక్తంగా సమావేశమయ్యారు. ఢిల్లీలోని ఖట్టర్ అధికారిక నివాసంలో జరిగిన ఈ భేటీలో హైదరాబాద్ మెట్రో రెండో దశ విస్తరణతో పాటు రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 విస్తరణకు కేంద్ర సహకారం, ప్రాజెక్టుకు అవసరమైన నిధుల సమీకరణ, ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) ద్వారా రుణం సమకూర్చే అవకాశాలపై సుదీర్ఘంగా మంతనాలు జరిగినట్లు సమాచారం. ప్రాజెక్టు అమలును వేగవంతం చేసే అంశాలపై కూడా చర్చించినట్లు తెలిసింది.మంగళవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమావేశమైన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా కూడా ఐఆర్ఎఫ్‌సీ రుణం, మెట్రో ప్రాజెక్టుకు అవసరమైన ఆర్థిక సహకారంపై మిగతా 2లో..



## ఉపాధి హామీ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టండి

అధికారులకు మంత్రి సీతక్క సూచనలు..
గ్రామీణాభివృద్ధి పనులపై సమీక్ష
తాగునీటి సరఫరాపై అధికారులకు ఆదేశాలు
మహిళా సంఘాల బలోపేతంపై దృష్టి
గ్రామీణ రహదారుల పురోగతిపై సమీక్ష
స్వచ్ఛభారత్ లక్ష్యాల సాధనకు సూచనలు
'జలసిరి' పోస్టర్లను ఆవిష్కరించిన మంత్రి

హైదరాబాద్, (డిడి9 వార్త): గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల పనితీరుపై రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశాన్ని గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క నిర్వహించారు. మంగళవారం జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో జరిగిన ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు, జడ్పీ సీఈవోలు, డీఆర్‌డీఓలు, డీపీఓలు పాల్గొన్నారు. జిల్లాల వారీగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకం అమలు, కూలీలకు పనిదినాల కల్పన, పెండింగ్‌లో ఉన్న మెటీరియల్ బిల్లుల చెల్లింపుపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ భవనాలు, మహిళా శక్తి భవనాలు, గ్రామపంచాయతీ మిగతా 2లో..

# ఏసీబీ వలలో ఎక్సైజ్ సూపరింటెండెంట్

**మొదటిపేజీ తరువాయి**

కూడబెట్టారనే పక్కా సమాచారంతో నిజామాబాద్ జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ మల్లారెడ్డి నివాసాలు, కార్యాలయాలపై ఏసీబీ అధికారులు విరుచుకుపడ్డారు. మంగళవారం తెల్లవారుజాము నుంచే రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు నిజామాబాద్, హైదరాబాద్ నగరాల్లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించాయి. ఈ సోదాల్లో అక్రమ ఆస్తులకు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్న అధికారులు, మల్లారెడ్డిని అదుపులోకి తీసుకుని నిజామాబాద్ నుంచి హైదరాబాద్‌కు తరలించారు. ఈ దాడులు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ అధికారుల్లో తీవ్ర కలకలం రేపాయి. నిజామాబాద్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి అవినీతి అక్రమాలపై ఏసీబీ ప్రధాన కార్యాలయానికి వరుసగా ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో నిఘా పెట్టిన అధికారులు మంగళవారం తెల్లవారుజామునే యాక్షన్ ప్లాన్ అమలు చేశారు. ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు (స్పెషల్ టీమ్స్) పలు గ్రూపులుగా విడిపోయి, మల్లారెడ్డికి సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలపై ఒకేసారి మెరుపు దాడులు నిర్వహించాయి. ఆయనకు ఏమాత్రం కోలుకునే అవకాశం ఇవ్వకుండా ఈ సోదాలు జరిగాయి. నిజామాబాద్ నగరంలోని సుభాష్ నగర్ ప్రాంతంలో ఉన్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రధాన కార్యాలయంలో ఒక ఏసీబీ బృందం తనిఖీలు చేపట్టింది. అదే సమయంలో ప్రగతి నగర్‌లో మల్లారెడ్డి అద్దెకు ఉంటున్న నివాస గృహంలోనూ మరో బృందం సోదాలు ప్రారంభించింది. ఆఫీసులోని ఫైళ్లను, ఇంట్లోని బీరువాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల సమయంలో ఎక్సైజ్ శాఖకు చెందిన కొందరు సిబ్బందిని కూడా అధికారులు విచారించి వివరాలు సేకరించారు. మల్లారెడ్డి కేవలం నిజామాబాద్‌కే పరిమితం కాకుండా హైదరాబాద్‌లోనూ భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. హైదరాబాద్‌లోని మచ్చబొల్లారంలో ఉన్న మల్లారెడ్డి సొంత నివాసంతో పాటు, ఆయనకు అత్యంత ఆప్తులైన బంధువులు, స్నేహితుల ఇళ్లల్లోనూ దాడులు జరిగారు. నిజామాబాద్ మరియు హైదరాబాద్ నగరాల పరిధిలో మొత్తం 11 కీలక ప్రాంతాలలో ఒకే సమయంలో ఈ తనిఖీలు నిర్వహించడం గమనార్హం.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి గత ఆరేళ్లుగా నిజామాబాద్ జిల్లాలోనే సుదీర్ఘ కాలంగా బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు ఏసీబీ అధికారులు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. ఒకే ప్రాంతంలో ఇన్నేళ్లుగా పనిచేస్తుండటంతో స్థానిక మద్యం వ్యాపారులతో, బెల్ట్ షాపుల నిర్వాహకులతో ఆయనకు బలమైన సంబంధాలు ఏర్పడ్డాయని సమాచారం. ఈ సుదీర్ఘ కాలంలోనే ఆయన భారీగా మామూళ్లు వసూలు చేసి కోట్లాది రూపాయల అక్రమ ఆస్తులను వెనకేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిజామాబాద్ ఎక్సైజ్ కార్యాలయంలో జరిపిన సోదాల్లో ఏసీబీ అధికారులకు కొన్ని అత్యంత కీలకమైన ప్రభుత్వ డాక్యుమెంట్లు, ప్రైవేట్ రికార్డులు లభ్యమయ్యాయి. మల్లారెడ్డి వ్యక్తిగత లావాదేవీలకు సంబంధించిన కొన్ని డైరీలను కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు ఆయన నివాసంలో దొరికిన పలు భూముల రిజిస్ట్రేషన్ కాపీలు, ఇతర విలువైన వస్తువులను ఏసీబీ బృందం తమ వశం చేసుకుంది.సోదాల సమయంలో మల్లారెడ్డికి సంబంధించిన వివిధ బ్యాంక్ అకౌంట్ల వివరాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పెద్ద ఎత్తున జరిగిన బ్యాంక్ ట్రాన్సాక్షన్లకు (ఆర్థిక లావాదేవీలు) సంబంధించిన పత్రాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ 11 ప్రాంతాల సోదాల్లో మొత్తం ఎంత నగదు దొరికింది? ఎన్ని కిలోల బంగారం, వెండి లేదా వజ్రాల ఆభరణాలు లభించాయి? అనే పూర్తి వివరాలను ఏసీబీ ఉన్నతాధికారులు ఇంకా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గట్టి ఆధారాలు లభించడంతో నిజామాబాద్‌లో ఉన్న మల్లారెడ్డిని ఏసీబీ అధికారులు అధికారికంగా అదుపులోకి తీసుకున్నారు. స్థానికంగా విచారిస్తే ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో, ఆయనను ప్రత్యేక వాహనంలో నిజామాబాద్ నుండి హైదరాబాద్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి తరలించారు. అక్కడ ఉన్నతాధికారుల సమక్షంలో ఆయనను ముఖాముఖి కూర్చోబెట్టి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఇటీవలి కాలంలో తెలంగాణలో అవినీతి నిరోధక శాఖ తన వేగాన్ని అమాంతం పెంచింది. అక్రమంగా కోట్లు కూడబెడుతూ, సామాన్య ప్రజలను పీడించే ప్రభుత్వ అధికారుల ఆట కట్టిస్తోంది. ఎంతటి పెద్ద హోదాలో ఉన్న అధికారి అయినా సరే.. పక్కా ఆధారాలు దొరికితే చాలు జైలుకు పంపుతోంది. వరుసగా పెద్ద పెద్ద అధికారులు ఏసీబీ దాడుల్లో అడ్డంగా దొరికిపోతుండటంతో, లంచాలు తీసుకునే ఇతర అవినీతి అధికారుల గుండెల్లో ఇప్పుడు వణుకు మొదలైంది.

## ఉపాధి హామీ అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టండి

**మొదటిపేజీ తరువాయి**

కార్యాలయాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. జల సంరక్షణ పనులు, చెక్‌డ్యాంల నిర్మాణం, ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎమ్‌కేఎస్‌వై) పనుల పురోగతిపైనా సమీక్ష నిర్వహించారు. గ్రామపంచాయతీల పనితీరు, గ్రామ కార్యదర్శుల హాజరు, పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటి పన్నుల వసూళ్ల పురోగతిపై ఆరా తీశారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపడుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని అధికారులకు సూచించారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం ఉండకూడదని మిషన్ భగీరథ అధికారులను మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు నిరంతరాయంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ రహదారుల నిర్మాణం, మరమ్మతు పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మహిళా సంఘాల బలోపేతం, బ్యాంకు లింకేజీల పెంపు, మహిళలకు ఉపాధి అవకాశాల విస్తరణకు కార్యాచరణ రూపొందించాలని సెర్ప్ అధికారులకు సూచించారు. ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రతి సంక్షేమ, అభివృద్ధి పథకాన్ని సమర్థంగా అమలు చేయాలని సీతక్క అధికారులను ఆదేశించారు. గ్రామీణ తెలంగాణ అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. సమావేశం అనంతరం గ్రామస్థాయిలో భూగర్భ జలాల పెంపునకు అవగాహన కల్పించే 'జలసిరి' పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు.

## కొత్తగూడెం గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుకు సహకరించండి

**మొదటిపేజీ తరువాయి**

చేసిన ప్రతిపాదనపై వెంటనే స్పందించి, సివిల్ ఏవియేషన్ శాఖ ద్వారా ఫీజిబులిటీ సర్వే నిర్వహించినందుకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి తుమ్మల కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఆ సర్వేలో ప్రతిపాదిత స్థలం విమానాశ్రయ నిర్మాణానికి అనుకూలంగా లేదని తేలడంతో, రాష్ట్ర ప్రభుత్వం మరో ప్రత్యామ్నాయ స్థలాన్ని ప్రతిపాదించినట్లు వివరించారు.

కొత్తగా ప్రతిపాదించిన స్థలంలో వీలైనంత త్వరగా ఫీజిబులిటీ సర్వే నిర్వహించి, గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర మంత్రిని తుమ్మల కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఆధ్యాత్మిక క్షేత్రమని, దక్షిణ అయోధ్యగా గుర్తింపు పొందిన ఈ పుణ్యక్షేత్రానికి దేశ విదేశాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారని తుమ్మల వివరించారు. ఎయిర్‌పోర్టు ఏర్పాటు వల్ల భద్రాచలంతో పాటు మొత్తం ప్రాంత అభివృద్ధికి, పర్యాటక రంగానికి, పారిశ్రామిక ప్రగతికి ఊతమిస్తుందని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

సమావేశంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించిన తదుపరి చర్యలు, కేంద్రరాష్ట్ర సమన్వయం, సాంకేతిక అంశాలపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.

## ధాన్యం సేకరణ లక్ష్యాలు పెంచండి

**మొదటిపేజీ తరువాయి**

వ్యవహారాలు, ఆహార, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి ఆయన ఒక లేఖ రాశారు. మంగళవారం కొత్త ఢిల్లీలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రిని స్వయంగా కలిసి ఈ వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం దిల్లీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) ఇస్తూ ఒక్క గింజ కూడా నష్టపోకుండా కొనుగోలు చేస్తోందని వివరించారు. దేశంలోనే మరే రాష్ట్రంలోలేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుత రబీ సీజన్‌లో ఇప్పటివరకు రికార్డు స్థాయిలో 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు ప్రక్రియ ఇంకా విజయవంతంగా కొనసాగుతోందన్నారు. 202526 మార్కెటింగ్ సంవత్సరానికి గాను ఖరీఫ్, రబీ సీజన్లను కలిపి చూస్తే తెలంగాణలో ఏకంగా 152 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వరి సేకరణ జరిగిందని, ఇది రాష్ట్ర చరిత్రలోనే ఒక అద్భుతమైన చారిత్రాత్మక రికార్డు అని ఆయన సగర్వంగా ప్రకటించారు.రాష్ట్ర ప్రభుత్వం పంపిన వరి ఉత్పత్తి అంచనాలకు భిన్నంగా కేంద్ర ప్రభుత్వం కొనుగోలు లక్ష్యాలను చాలా తక్కువగా నిర్ధారించడం వల్ల తెలంగాణపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని మంత్రి ఉత్తమ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌కు గాను రాష్ట్రప్రభుత్వం 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి సేకరణ జరుగుతుందని ముందే అంచనాలు సమర్పించిందన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం మాత్రం కేవలం 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించడమే లక్ష్యంగా పెట్టుకుందని, ఇది కేవలం 51.47 లక్షల మెట్రిక్ టన్నుల వరికి మాత్రమే సమానమని మంత్రి తప్పుబట్టారు. కేంద్రం చేతులెత్తేసినా రైతుల కోసం తామే కొనుగోళ్లు జరిపామన్నారు.

గడిచిన మూడు సీజన్లను పరిశీలిస్తే కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన పరిమితుల కంటే చాలా ఎక్కువగా తెలంగాణ ప్రభుత్వం 69.50 లక్షల మెట్రిక్ టన్నుల వరిని అదనంగా కొనుగోలు చేయాల్సి వచ్చిందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. ఈ అదనపు కొనుగోళ్ల వల్ల రాష్ట్ర ఖజానాపై ఏకంగా రూ. 16,446 కోట్ల అదనపు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) భారం పడిందని స్పష్టం చేశారు. అయినప్పటికీ అన్నదాతలకు నష్టం జరగకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ఈ భారాన్ని భరించిందని చెప్పారు.

రాష్ట్రంలో తీవ్రమైన ఎండల తీవ్రత, ధాన్యం మార్కెట్లలో హమాలీల కొరత, గిడ్డంగుల్లో నిల్వ సామర్థ్య సమస్యలు, ఒకేసారి భారీగా తరలివచ్చిన వరి కుప్పలు, అకాల వర్షాలు వంటి ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పటికీ ప్రభుత్వం ఎక్కడా వెనుకడుగు వేయలేదని మంత్రి ఉత్తమ్ స్పష్టం చేశారు. రైతుల నుంచి వచ్చిన ప్రతి గింజను తుచ తప్పకుండా కొనుగోలు చేశామని, తద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, రైతుల వ్యక్తిగత ఆదాయాన్ని కాపాడటంలో తెలంగాణ పౌర సరఫరాల శాఖ పూర్తి విజయం సాధించిందని ఆయన కొనియాడారు.

కస్టమ్ మిల్ల్ రైస్ (సీఎంఆర్) సరఫరా అంశంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రి దృష్టికి కొన్ని కీలక సాంకేతిక ఇబ్బందులను తీసుకెళ్లారు. గత రబీ 202425 సీజన్‌కు సంబంధించి ఇంకా 5 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, అలాగే ఖరీఫ్ 202526కు సంబంధించి 14.24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని కేంద్ర పూల్‌కు సరఫరా చేయాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో నిల్వ స్థలాల కొరత ఉండటం, ఒకేసారి పలు సీజన్ల కొనుగోళ్లు జరగడం వల్ల మిల్లింగ్ సామర్థ్యాలపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని, అందుకే గడువులను పొడిగించక తప్పని పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు.రాష్ట్రంలోని మిల్లింగ్ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రబీ 202425 సీఎంఆర్ సరఫరా గడువును మరో 60 రోజులు, అలాగే ఖరీఫ్ 202526 గడువును 120 రోజుల పాటు పొడిగించాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. దీనితో పాటు ప్రస్తుత రబీ 202526 సేకరణ లక్ష్యాన్ని 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నుండి ఏకంగా 54.50 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యానికి పెంచాలని డిమాండ్ చేశారు. అంటే తాము సేకరించిన 80.09 లక్షల మెట్రిక్ టన్నుల వరికి సమానమైన బియ్యాన్ని కేంద్రం సేకరించాలని కోరారు.

తెలంగాణలో రబీ సీజన్ వాతావరణ పరిస్థితుల కారణంగా పండే వరి ఎక్కువగా ఉప్పుడు బియ్యం (బాయిల్డ్ రైస్) తయారీకి మాత్రమే అనుకూలంగా ఉంటుందని మంత్రి ఉత్తమ్ ఈ సందర్భంగా కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి వివరించారు. ఈ బియ్యాన్ని ముడి బియ్యంగా మారిస్తే నూకల శాతం ఎక్కువగా వస్తుందని, కాబట్టి వీటిని బాయిల్డ్ రైస్ రూపంలోనే కేంద్ర పూల్‌కు సరఫరా చేసేందుకు ప్రత్యేక అనుమతి ఇవ్వాలని కోరారు. భవిష్యత్తులో రాబోయే ఖరీఫ్ 202627 సీజన్ నుండి కేంద్రం నిర్ణయించే లక్ష్యాలు.. రాష్ట్ర ప్రభుత్వం పంపే వాస్తవ ఉత్పత్తి అంచనాలకు అనుగుణంగానే ఉండాలని సూచించారు. రైతులు పండించిన పంటకు సకాలంలో సరైన మద్దతు ధర లభించాలంటే కేంద్ర ప్రభుత్వ కొనుగోలు లక్ష్యాలు, రాష్ట్రంలోని వాస్తవ క్షేత్రస్థాయి పరిస్థితులు ఒకదానితో ఒకటి సమన్వయంతో ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

## ఖట్టర్‌తో సీఎం రేవంత్, కిషన్‌రెడ్డి కీలక భేటీ

**మొదటిపేజీ తరువాయి**

చర్చించారు. ఆ సమావేశానికి కొనసాగింపుగానే బుధవారం ఖట్టర్‌తో జరిగిన భేటీలో అశ్వినీ వైష్ణవ్ కూడా పాల్గొన్నారు. హైదరాబాద్ మెట్రో రెండో దశతో పాటు తెలంగాణలో చేపడుతున్న ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రం నుంచి అందాల్సిన సహకారం, నిధుల విడుదల, కేంద్రరాష్ట్ర సమన్వయంపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టుల పురోగతిపై కూడా సమీక్ష నిర్వహించినట్లు తెలుస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర సహకారం లభించే దిశగా వరుసగా జరుగుతున్న ఈ సమావేశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సమావేశం అనంతరం అధికారిక ప్రకటన వెలువడనప్పటికీ, ప్రాజెక్టులకు సంబంధించిన కీలక అంశాలపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.



## మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి హౌస్ అరెస్ట్

**మొదటిపేజీ తరువాయి**

పోలీసులు ఆయన నివాసానికి చేరుకుని బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు.

ప్రశాంత్‌రెడ్డిని గృహనిర్బంధం చేయడాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ప్రశాంత్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడి సంఘీభావం తెలిపారు. రైతుల తరఫున ప్రశ్నించే నాయకులను అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు.

రాష్ట్రవ్యాప్తంగా యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పైగా యూరియా పంపిణీలో అమలు చేస్తున్న యాప్ విధానం మరిన్ని సమస్యలకు దారితీస్తోందని వారు ఆరోపించారు. రైతుల ఇబ్బందులను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, సమస్యలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై పోలీసులను ప్రయోగించడం దురదృష్టకరమని విమర్శించారు.

రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, యూరియా పంపిణీలో నెలకొన్న ఇబ్బందులను తొలగించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల తరఫున తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## శతాధిక వృద్ధురాలు కందిమల్ రామవ్వ కన్నుమూత

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్22(డీడీ9 వార్త):**

సాలూర మండల కేంద్రానికి చెందిన కందిమల్ రామవ్వ (103) మరణించడం ఆ కుటుంబానికే కాకుండా, గ్రామస్తులందరికీ తీరని లోటు. మూడు తరాలను కళ్లారా చూసిన ఆమె, శతాధిక వయస్సును పూర్తి చేసుకోవడం విశేషం. నేటి కాలంలో మారుతున్న జీవనశైలితో తక్కువ వయస్సులోనే మరణాలు సంభవిస్తున్న వేళ, రామవ్వ గారు 103 ఏళ్ల సుదీర్ఘ జీవితాన్ని గడపడం ఒక అద్భుతం. ఆమె మరణం పట్ల గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. రామవ్వ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నారు.



## 'రైతు ఆశీర్వాద సభ' కాదు.. 'రైతు క్షమాపణ సభ' పెట్టుకోండి.!

**మొదటిపేజీ తరువాయి**

కూడా నెరవేర్చకుండా ప్రజలకు, రైతులకు నమ్మకద్రోహం చేశారని మండిపడ్డారు. హామీలు 100 రోజుల్లో నెరవేర్చకపోతే నిలదీయమన్న భట్టి విక్రమార్క మాటలను గుర్తు చేస్తూ.. "మరి ఇప్పుడు రండి, మిమ్మల్ని నిలదీస్తాం" అని హరీష్ రావు సవాల్ విసిరారు. సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో చేసిన వ్యాఖ్యలు, ఇచ్చిన హామీలు , వాటిపై ఆయన ఎన్నిసార్లు మాట తప్పారో చూపే ప్రత్యేక వీడియోలను స్క్రీన్‌పై ప్లే చేస్తూ హరీష్ రావు కాంగ్రెస్ తీరును ఎండగట్టారు.

**రైతుబంధు ఎగ్గొట్టారు..**
**కేసీఆర్ పాలనే శ్రీరామరక్ష..**

తంలో కేసీఆర్ ప్రభుత్వం రెండు పంటలకు రూ. 10 వేలు చొప్పున రైతుబంధు ఇస్తుంటే, తాము అధికారంలోకి వస్తే మూడు పంటలకు రూ. 15 వేలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు నమ్మబలికారని హరీష్ రావు విమర్శించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ హామీని ఎందుకు అమలు చేయలేదని ఆయన నిలదీశారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ప్రభుత్వం కోట్ల రూపాయల నిధులను పెండింగ్‌లో పెట్టిందని ఆరోపించారు. కరోనా మహమ్మారి వంటి అత్యంత కఠినమైన ఆర్థిక పరిస్థితుల్లో కూడా ఎక్కడా ఆగకుండా 13 లక్షల రైతు కుటుంబాలకు రూ. 73 వేల కోట్ల రైతుబంధు నిధులను సకాలంలో అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని గుర్తు చేశారు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ప్రజలకు ఏం కావాలో ముందే గుర్తించి చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఇప్పుడు అచ్చంపేట చూసినా, అశ్వారావుపేట చూసినా ప్రజలందరి నోటా "మళ్లీ కేసీఆర్ రావాలి" అనే మాట ఒక్కటే వినిపిస్తోందని అన్నారు.

**భద్రాద్రి రాముడి సాక్షిగా మోసం..**

రెండు లక్షల రైతు రుణమాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ఎగ్గొట్టిందని హరీష్ రావు ధ్వజమెత్తారు. భద్రాద్రి రాముడిని సాక్షిగా పెట్టి రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి, చివరకు ఆ దేవుడినే మోసం చేశారని, ఇక ప్రజలను మోసం చేయకుండా ఉంటారా అని ప్రశ్నించారు. త్వరలోనే మధిరలో భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు 'రైతు ఆశీర్వాద సభ' అని పేరు పెట్టడం రైతాంగాన్ని అవమానించడమేనన్నారు. రైతులను మోసం చేసినందుకు గానూ ఆ సభకు 'రైతు క్షమాపణ సభ'గా నామకరణం చేసుకోవాలని హరీష్ రావు ఎద్దేవా చేశారు.

**మిల్లర్ల చేతిలో తోలుబొమ్మగా రేవంత్ రెడ్డి**

ప్రస్తుతం రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారిందని, మార్కెట్‌లో యూరియా దొరకడం లేదని, యాసంగి బోనస్ రెండు సార్లు ఇవ్వాల్సి ఉన్నా అడ్రస్ లేదని హరీష్ రావు విమర్శించారు. వడ్ల కొనుగోళ్లలో క్వింటాకు 5 కేజీల చొప్పున తరుగు తీస్తూ రైతులను నిలువునా ముంచుతున్నారని మండిపడ్డారు. "అసెంబ్లీలో వడ్లకు తరుగు తీస్తే తోలు తీస్తా అన్న రేవంత్ రెడ్డి.. ఇప్పుడు తరుగు తీస్తున్నా పట్టించుకోకుండా రైస్ మిల్లర్లు, దళారుల చేతుల్లో తోలుబొమ్మగా మారారు" అని ఘాటుగా విమర్శించారు.

**ప్రాజెక్టుల విధ్వంసం.. కరెంట్ కోతలు**

పెద్దవాగు ప్రాజెక్ట్ కొట్టుకుపోవడానికి పూర్తిగా ఈ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని హరీష్ రావు ఆరోపించారు. ప్రమాద సమయంలో గేట్లు ఎత్తే నాథుడే లేకపోవడం వల్లే ఆ ప్రాజెక్ట్ కొట్టుకుపోయిందన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో కొత్తగా ఒక్క ప్రాజెక్ట్ కూడా కట్టలేదు సరే కదా, ఉన్న ప్రాజెక్టులను కూడా కాపాడుకోలేక కొట్టుకుపోయేలా చేస్తున్నారని మండిపడ్డారు.

వ్యవసాయ బావులకు, బోరుబావులకు రైతుల వద్ద 'డిస్కమ్' (Discom) మీటర్లు పెట్టాలని చూస్తున్నారని, అదే గనుక జరిగితే రైతులకు రోజుకు కేవలం 6 గంటల కరెంట్ మాత్రమే వస్తుందని హెచ్చరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో 24 గంటల కరెంట్ ఎలా ఉంటుందో, అశ్వారావుపేట గ్రామీణ ప్రాంతాల్లో కూడా అలానే ఉండాలని ఆశించి ఉచిత విద్యుత్ ఇచ్చారని గుర్తు చేశారు.

**గిరిజన, ఎస్సీ, ఎస్టీ వ్యతిరేక ప్రభుత్వం**

స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఎస్సీ, ఎస్టీలకు ఒక్క కార్పొరేషన్ లోన్ కూడా ఇప్పించలేకపోయారని హరీష్ రావు విమర్శించారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా ఎంతమంది గిరిజన పిల్లలకు సహాయం అందించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను ప్రశ్నిస్తే.. రూ. 2,750 కోట్లు కేటాయించామని చెప్తున్నారే తప్ప, క్షేత్రస్థాయిలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ముమ్మాటికీ గిరిజన వ్యతిరేక ప్రభుత్వమని హరీష్ రావు దుయ్యబట్టారు.

## రేవంత్ ఏ స్కీమ్ తెచ్చినా.. దాని వెనుక స్కాం ఉంటుంది

**మొదటిపేజీ తరువాయి**

నిర్మించింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో టెండర్లు కూడా పూర్తి చేసి, 2023 జూన్‌జులైలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా, రేవంత్ రెడ్డి వచ్చి ఎయిర్‌పోర్ట్ మెట్రోను రద్దు చేశారు. ఇది తుగ్లక్ నిర్ణయం" అని కేటీఆర్ మండిపడ్డారు.

ఎయిర్‌పోర్ట్ మెట్రో కొనసాగి ఉంటే ఈ పాటికి పూర్తి అయి ఉండేదని చెప్పారు. భూసేకరణ సమస్య కూడా లేకుండా, ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానం చేసి ట్రాఫిక్ సమస్యలు తగ్గించాలని ఆలోచన చేశామని కేటీఆర్ గుర్తు చేశారు. ప్రస్తుతం కిషన్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఢిల్లీలో కొత్త డ్రామా మొదలుపెట్టారని, మళ్లీ మెట్రో పనులు ప్రారంభించాలంటే 2028లో కేసీఆర్‌ను మళ్లీ సీఎంగా చేయాల్సి ఉంటుందని కేటీఆర్ వ్యాఖ్యానించారు.



# బాసరలో అర్ధరాత్రి దొంగల బీభత్సం

- మహంకాళి అమ్మవారి ఆలయంలో చోరీ
- వెండి కిరీటం, హుండీతో పరారీ
- వ్యాసగుడి వద్ద ఖాళీ హుండీ లభ్యం
- నిత్య పూజల వేళ వెలుగులోకి ఘటన
- సీసీటీవీ, క్లూస్ టీమ్స్ ఆధారంగా విచారణ

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన నిర్మల్ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భారీ చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తుతెలియని దుండగులు ఆలయ ఆవరణలోకి చొరబడి పక్కా స్కెచ్‌తో ఈ దొంగతనానికి పాల్పడ్డారు. సరస్వతీ దేవి ఆలయ పైఅంతస్తులో కొలువై ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారి గుడిని టార్గెట్ చేసిన దొంగలు.. లోపలికి చొరబడి అమ్మవారి వెండి కిరీటం, భక్తులు కానుకలు సమర్పించే హుండీని ఎత్తుకెళ్లారు. భక్తులు ఎంతో పవిత్రంగా భావించే ఈ పుణ్యక్షేత్రంలో ఇలాంటి ఘటన జరగడం స్థానికంగా, భక్తజనాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. ఆలయంలోని భద్రతా లోపాలు ఈ ఘటనతో ఒక్కసారిగా వెలుగులోకి వచ్చాయి.

ఆలయ వర్గాల కథనం ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు మహంకాళి ఆలయ పరిసరాల్లో సంచరించారు. చుట్టుపక్కల ఎవరూ లేని సమయం చూసి, గుడి ప్రధాన గేటుకు ఉన్న తాళాలను రాడ్లతో పగలగొట్టి లోపలికి ప్రవేశించారు. నేరుగా గర్భగుడిలోకి చొరబడిన దుండగులు అమ్మవారి ప్రధాన అలంకరణకు ఉపయోగించే వెండి కిరీటాన్ని దొంగిలించారు. ఆలయంలో సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ దొంగలు ఎంతో చాకచక్యంగా లోపలికి వెళ్లడం గమనార్హం.

అమ్మవారి వెండి కిరీటాన్ని తీసుకున్న దొంగలు, అంతటితో ఆగకుండా భక్తులు సమర్పించిన కానుకలతో నిండి ఉన్న ఆలయ హుండీని సైతం అలాగే నేల నుంచి పెకలించి ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత ఆలయ ప్రాంగణం వెలుపలికి వెళ్లిన దొంగలు.. నిర్మానుష్య ప్రాంతంలో హుండీ తాళాలు పగలగొట్టి అందులోని నగదు మొత్తాన్ని కాజేశారు. అనంతరం ఖాళీ అయిన హుండీ ఇనుప పెట్టెను సమీపంలోని వ్యాసగుడి వద్ద పడేసి.. అక్కడి నుంచి రాత్రి చీకట్లోనే పరారయ్యారు.

మంగళవారం తెల్లవారుజామున ఆలయ అర్చకులు నిత్య పూజల నిర్వహణ కోసం ఆలయానికి వచ్చారు. సరస్వతీ అమ్మవారి సుప్రభాత సేవ ముగించుకుని, పైఅంతస్తులోని మహంకాళి గుడికి వెళ్లడంతో ఈ దొంగతనం ఘటన మొదటిసారిగా వెలుగులోకి వచ్చింది. ఆలయ సింహద్వారం గేటు విరిగిపోయి ఉండటం, గర్భగుడిలో పూజా సామాగ్రి అంతా చెల్లాచెదురుగా పడి ఉండటం చూసి అర్చకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. గర్భగుడిలో అమ్మవారి వెండి కిరీటం, హుండీ మాయమైనట్లు స్పష్టంగా గుర్తించిన అర్చకులు వెంటనే ఈ విషయాన్ని ఆలయ ఉన్నతాధికారులకు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (ఈవో)కు చేరవేశారు. ఆలయ అధికారులు తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ఈ దొంగతనంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో అధికారికంగా ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు.



సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు. ముందస్తు ఆధారాల కోసం ప్రత్యేక క్లూస్ టీమ్స్, డాగ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించారు. ఘటనా స్థలంలో దొంగలకు సంబంధించిన వేలిముద్రలను, ఇతర సాక్ష్యాలను క్లూస్ టీమ్స్ సేకరిస్తున్నాయి. పోలీస్ కుక్కలు ఆలయ ప్రాంగణం నుంచి హుండీ పారేసిన వ్యాసగుడి వరకు పరిగెత్తి ఆగిపోయాయి. ఆలయ ప్రాంగణంలో గట్టి నిఘా ఉన్నప్పటికీ దొంగలు ఇంత సాహసానికి ఒడిగట్టడంపై పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆలయంలోపల, వెలుపల వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాల పుటేజీలను పోలీసులు నిశితంగా పరిశీలిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో ఆలయ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగిన వ్యక్తుల కదలికలను రికార్డుల ద్వారా గుర్తిస్తున్నారు.

బాసర లాంటి పెద్ద ఆలయంలో నిరంతరం భద్రతా సిబ్బంది కాపలా ఉంటారు. అంతటి నిఘా వ్యవస్థను దాటుకుని దొంగతనం జరగడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంతర్గత భద్రతా సిబ్బంది ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహించారా? లేదా ఆలయ పరిసరాలపై పూర్తి అవగాహన ఉన్న స్థానికుల హస్తం ఏదైనా ఉందా? అనే కోణంలో కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

దేశం నలుమూలల నుండి అక్షరాభ్యాసాల కోసం నిత్యం వేలాది మంది భక్తులు వచ్చే బాసర క్షేత్రంలో ఇలాంటి దొంగతనం జరగడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఆలయ భద్రతా లోపాలపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆలయ అధికారులు స్పందించి, బాసర క్షేత్రంలో భద్రతను మరింత కట్టుదిట్టం చేయాలని, మరిన్ని అధునాతన నిఘా కెమెరాలు ఏర్పాటు చేయాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.



## బోధన్ రూరల్ ఎస్సై రాజశేఖర్‌ను సన్మానించిన విద్యార్థి పరిషత్ నాయకులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్22(డీడీ9వార్త):**

బోధన్ రూరల్ ఎస్సైగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్ ను తెలంగాణ విద్యార్థి పరిషత్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సైని శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఎస్సై రాజశేఖర్ పోలీస్ శాఖలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి పరిషత్ బోధన్ డివిజన్ అధ్యక్షులు మీసాల నాగేష్, డివిజన్ కార్యదర్శి నిఖిల్, పట్టణ కార్యదర్శి వీరేశ్, నాయకులు షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ కోర్టులో ఉచిత వైద్య శిబిరం

- 250 మందికి పరీక్షలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్22(డీడీ9 వార్త):**

బోధన్ కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఘనంగా జరిగింది. లయన్స్ కంటి ఆసుపత్రి, బోధన్ జనరల్ ఆసుపత్రి మరియు నిజామాబాద్‌లోని మనోరమ ఆసుపత్రుల సహకారంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.ఆర్. దేశాయ్ తెలిపారు. ఈ శిబిరంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బందితో పాటు పోలీస్ శాఖ, కక్షిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉచిత వైద్య పరీక్షలు చేయించుకున్నారు. సుమారు 250 మందికి పైగా పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్న దేశాయ్, బార్ అసోసియేషన్ కార్యవర్గ కమిటీ మరియు జిల్లా అదనపు న్యాయమూర్తుల అనుమతితోనే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశామని వివరించారు. సామాజిక బాధ్యతతో న్యాయవాదులు చేపట్టిన ఈ వైద్య సేవల పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.





## దేశ సేవకు ఎంపికైన యువకుడిపై గ్రామ ప్రజల అభినందనల వెల్లువ

- ఘనంగా సన్మానించిన గ్రామస్తులు

**డిడి 9 వార్త గుడిహత్నూర్:**

భారత సైన్యంలో (ఆర్మీ) ఉద్యోగానికి ఎంపికైన తోషం గ్రామానికి చెందిన జిన్నం చరణ్ కి గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యువకుడికి శాలువా కప్పి, పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. గ్రామానికి చెందిన యువకుడు కష్టపడి చదివి, నిరంతర సాధనతో భారత సైన్యంలో ఉద్యోగం సాధించడం గ్రామానికి గర్వకారణమని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. యువత లక్ష్యసాధన కోసం కృషి చేస్తే ఉన్నత స్థానాలను చేరుకోవచ్చని అన్నారు.. దేశ రక్షణ కోసం సేవ చేసే అవకాశం లభించడం గొప్ప విషయమని పేర్కొంటూ యువకుడి భవిష్యత్తు విజయవంతంగా



ఉండాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సోయం దసురు సెడ్మకి భీమ్రావు షగీర్ ఖాన్ అప్కం పోచన్న రాచర్ల సత్యనారాయణ సమద్ ఖాన్ సదానంద్ స్వామి జిన్నం కిష్టయ్య రమేష్ బొడగం అలీం ఖాన్ గ్రామస్తులు యువకులు తదితరులు పాల్గొన్నారు

## వర్షంకురిసే అన్నదాత మురిసే

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం( డి డి 9 వార్త) జూన్ 23**

తలమడుగు మండలంలో పలు గ్రామాలలో సోమవారం రాత్రి కురిసిన వర్షానికి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు వాన కాలం సీజన్ ప్రారంభమైన నుండి ఆశించదగ్గ వానలు లేక అన్నదాత అవస్థలు పడిన విషయం తెలిసింది మండలంలో పలు గ్రామాల రైతులు పెద్ద మొత్తంలో వర్షాధారంపైనే పత్తి సోయా కందులు మొక్కజొన్న వంటి పంటలు పండిస్తున్నారు ఇప్పటికే కొన్ని గ్రామాలలో రైతులు పంట పొలాల్లో పత్తి విత్తనాలు వేసినప్పటికీ సరైన వర్షం లేక విత్తనాలు మొలకెత్తలేక నష్టపోయామని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ప్రభుత్వం ఆదుకొని నష్టపోయిన రైతులకు విత్తనాలు ఉచితంగా పంపిణీ చేయాలని పలువురు రైతులు అధికారులను వేడుకుంటున్నారు

## రైతులు ఉచిత సోయాబీన్ విత్తనాలని సద్వినియోగం చేసుకోవాలి

- సర్పంచ్ మేస్రం రూప

**అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం (డి డి 9 వార్త) జూన్ 23**

తలమడుగు మండలం ఝరి గ్రామపంచాయతీ పరిధిలో MGANREGS ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ ద్వారా రైతులకు పూర్తి రాయితీతో కూడిన సోయాబీన్ విత్తనాలు పంపిణీ చేసిన సర్పంచ్ మెస్రం రూప రైతులు తమ పంట పొలాల్లో విత్తనాలు నాటినప్పటికీ సరైన వర్షపాతం లేక విత్తనాలు మొలకెత్తక రైతులు నష్టపోయారని తెలుసుకొని వారి అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆమె తెలిపారు గ్రామంలో ఏ సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే గ్రామ పెద్దల సహకారంతో సమస్యలు పరిష్కరిస్తానని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మడవి లక్ష్మణ్ పంచాయతీ సెక్రెటరీ అశోక్ కారోబారి రాకేష్ రెడ్డి వార్డు సభ్యులు నవీన్ భుజంగరావు రైతులు రాములు దేవరావు కాశిరాం మరియు యువకులు పాల్గొన్నారు

## బోధన్ ఆటో కార్మికుల సొంతింటి కల సాకారం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్22(డీడీ9 వార్త):**

ఆటో కార్మికుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బోధన్ పట్టణంలోని ఆటోనగర్ యూనియన్ కార్మికులకు మంగళవారం బోధన్ ఆర్డీఓ కార్యాలయంలో ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ ముఖ్య సలహాదారులు, ఎమ్మెల్యే ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డి అర్హులైన కార్మికులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...సమాజంలో రవాణా రంగంలో ఆటో కార్మికుల పాత్ర కీలకమని, కష్టపడి పనిచేసే వారిని ఆదుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పేద, మధ్యతరగతి ప్రజలందరికీ ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందులో భాగంగానే సొంత ఇళ్ల కల నెరవేరుస్తున్నామని తెలిపారు. ఇన్నాళ్లూ కన్న కల నెరవేరడంతో కార్మికులు ఆనందం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ విజయకుమారి, మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మశారత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, ఆటో యూనియన్ ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.




## ప్రజల సందేహాల పరిష్కారానికి హెల్ప్ డెస్క్ : ఆర్డీఓ విజయకుమారి

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్22(డీడీ9 వార్త):**

బోధన్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎలక్షన్ సెల్ వద్ద ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను మంగళవారం ఆర్డీఓ విజయకుమారి ప్రారంభించారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు 'సర్2026' ప్రక్రియలో భాగంగా ఈ హెల్ప్ డెస్క్‌ను అందుబాటులోకి తెచ్చారు.

ఈ సందర్భంగా ఆర్డీఓ విజయకుమారి మాట్లాడుతూ... ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రజలకు ఏవైనా సందేహాలున్నా లేదా సమస్యలు తలెత్తినా పరిష్కరించుకోవడానికి ఈ హెల్ప్ డెస్క్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విఠల్, సీనియర్ అసిస్టెంట్ సుశీల, ఆపరేటర్ ముస్తఫా తదితర సిబ్బంది పాల్గొన్నారు.



## సాలుర మండల ఉపసర్పంచుల ఫోరం ఎన్నిక

- చెక్ పవర్ రద్దు అపోహలపై జూన్ 25న హైదరాబాద్‌లో ధర్నాకు పిలుపు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జూన్22(డీడీ9 వార్త):**

సాలుర మండల ఉపసర్పంచుల ఫోరం నూతన కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి అధ్యక్షుడిగా బుయ్యన్ సురేష్, ఉపాధ్యక్షుడిగా అవుతా మహేష్ రెడ్డి, జనరల్ కార్యదర్శిగా ప్రహ్లాద్, కోశాధికారిగా శ్రవణ్ కుమార్, కార్యదర్శిగా మహమ్మద్ బాధ్యతలు చేపట్టారు. కమిటీలో ఏకాభిప్రాయాన్ని పెంపొందించడం, ఉపసర్పంచులకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పోరాడటమే ఈ ఫోరం ముఖ్య ఉద్దేశమని వారు తెలిపారు. గత కొంతకాలంగా ఉపసర్పంచుల 'చెక్ పవర్' రద్దు కాబోతున్నట్లు సోషల్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న వార్తలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ అపోహల పట్ల ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోకపోవడంతో దీనిని నిరసిస్తూ తమ సమస్యలపై స్పష్టత కోరుతూ జూన్ 25న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ఉపసర్పంచులందరూ హాజరై, ఐక్యతను చాటాలని వారు పిలుపునిచ్చారు.



## రైతు సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్‌కు వినతి

**బోధన్, నిజామాబాద్ జూన్22(డీడీ9 వార్త):**

రాష్ట్రంలో అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు మంగళవారం రెంజల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పుట్టి నడిపి నాగన్న, గుమ్మల గంగాధర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పార్వతి రాజేశ్వర్ మాట్లాడుతూ... ప్రస్తుతం విత్తనాల ఎంపిక, ఎరువుల సరఫరా విషయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్ ద్వారా యూరియా బుక్ చేసుకోవాలనే నిబంధన రైతులకు అత్యంత భారంగా మారిందని, ఈ విధానాన్ని సడలించి రైతులకు అవసరమైన యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు. ఎకరాకు కనీసం నాలుగు బస్తాల యూరియా అవసరమని, పెరిగిన ఎరువుల ధరలను నియంత్రించి రైతులకు భారం తగ్గించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంట పెట్టుబడి సాయాన్ని సకాలంలో చెల్లించడంతో పాటు పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం సన్న రకం ధాన్యం కొనుగోలుపై విధించిన నిబంధనలు సరికాదని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు స్పష్టం చేశారు. రైతుల సమస్యల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా తక్షణమే స్పందించి పరిష్కరించాలని నాయకులు కోరారు.



## హెడ్ కానిస్టేబుళ్లుగా ఇద్దరు కానిస్టేబుళ్లకు పదోన్నతి

- **అభినందించిన నిజామాబాద్ సీపీ పి.సాయి చైతన్య**

**నిజామాబాద్ జిల్లా జూన్22(డీడీ9 వార్త):**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో కానిస్టేబుల్ నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన ఇద్దరు సిబ్బంది మంగళవారం జిల్లా పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్యను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ఈ పదోన్నతులు కల్పించారు. సుదీర్ఘ కాలంగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్న సిబ్బందికి పదోన్నతి లభించడంతో పోలీస్ శాఖలో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా ప్రమోషన్ పొందిన హెడ్ కానిస్టేబుళ్లను సీపీ సాయి చైతన్య ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో మరింత బాధ్యతాయుతంగా పనిచేసి శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. పదోన్నతి పొందిన వారిలో సి.సి.ఎస్ (అటాచ్‌మెంట్ ఫింగర్ ప్రింట్ /క్లూస్ టీం) కానిస్టేబుల్ బి.సుదర్శన్ (పీసీ: 1705), పోలీస్ కంట్రోల్ రూమ్ కానిస్టేబుల్ ఎన్.ప్రసాద్ (పీసీ: 1747) ఉన్నారు.

# రూ.60 లక్షల రోడ్డు ఒక్క వర్షానికే గంగపాలు..!

- **రూ.60 లక్షల రోడ్డు ఒక్క వర్షా నికే గంగపాలు..!**
- **కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ, ఐలాపురం గ్రామాలకు రాకపోకలు బంద్.**
- **ప్రజల కష్టాలకు బాధ్యులు ఎవరు..?**
- **బీఆర్ఎస్ ములుగు జిల్లా నాయకుడు: భూక్య జంపన్న**

**ములుగు , జూన్ 23, డీ డీ 9 వార్త :**






ప్రభుత్వం సుమారు రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన సైడ్ డైవర్షన్ రోడ్డు ఒక్క వర్షానికే దెబ్బతినడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని బీఆర్ఎస్ ములుగు జిల్లా నాయకుడు భూక్య జంపన్న తీవ్రంగా విమర్శించారు. ఇంకా వర్షాకాలం పూర్తిస్థాయిలో ప్రారంభం కాకముందే రోడ్డు కొట్టుకుపోవడంతో కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ, ఐలాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.
మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. గతంలోనే ఈ డైవర్షన్ రోడ్డు ఎక్కువ కాలం నిలవదని తాను హెచ్చరించినప్పటికీ ప్రభుత్వం, సంబంధిత అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రస్తుతం గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన ప్రజలు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.
నాలుగు గ్రామాల ప్రజల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉందని జంపన్న పేర్కొన్నారు. ప్రజాధనంతో చేపట్టిన అభివృద్ధి పనులు ఒక్క వర్షానికే దెబ్బతినడం బాధాకరమని, దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
గతంలో తాను చేసిన హెచ్చరికలను ప్రభుత్వం, మంత్రి సీతక్క పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొండాయి, మల్యాల, గోవిందరాజుల కాలనీ, ఐలాపురం గ్రామాల ప్రజలకు తక్షణమే ప్రత్యామ్నాయ రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని భూక్య జంపన్న డిమాండ్ చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయన కోరారు.

## చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి

- **సామాజిక కార్యకర్త బంగారు సాయిలు**

**బోధన్ (కోటగిరి), నిజామాబాద్ జిల్లా జూన్22(డీడీ9 వార్త):**

ప్రజలలో చట్టంపై అవగాహన కల్పించే లక్ష్యంతోనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన గ్రంథాలను విస్తృతంగా పంపిణీ చేస్తున్నట్లు ప్రముఖ సామాజిక కార్యకర్త, దళిత, బహుజన సంఘాల నాయకులు బంగారు సాయిలు తెలిపారు. మంగళవారం కోటగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అంబేద్కర్ రచించిన పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బంగారు సాయిలు మాట్లాడుతూ.. మతపరమైన పుస్తకాలను చదివేందుకు చూపిన శ్రద్ధను, మన ప్రాథమిక హక్కులను, చట్టాలను వివరించే అంబేద్కర్ రచించిన గ్రంథాలపై కూడా చూపాలని కోరారు. చట్టం గురించి సామాన్యులకు సైతం అవగాహన కల్పించాలనే సంకల్పంతోనే తాను ఇప్పటివరకు 50 వేలకు పైగా పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశానని, ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత, బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



## కుసుంబాయి తండాలో అంగన్వాడీ భవన నిర్మాణానికి శ్రీకారం

**జనగామ జూన్ 23(డిడి 9వార్త)బ్యూరో**

రఘునాథపల్లి మండలంలోని కుసుంబాయి తండ గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) నిధులతో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన అంగన్వాడీ భవన పనులకు గ్రామ సర్పంచ్ కొర్ర స్వరూప రాజేందర్ నాయక్ శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్నికల హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని తెలిపారు.
నూతన అంగన్వాడీ భవనం ద్వారా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందడంతో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలుకు మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అనిల్ కుమార్, అంగన్వాడీ టీచర్ లలిత, వార్డు సభ్యులు, గ్రామ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు ప్రజలు పాల్గొన్నారు.






## నర్మెట్టలో ఘనంగా విత్తన మేళా

- **సన్న రకాల వరి సాగుకు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు***

**జనగామ జూన్ 23(డిడి 9 వార్త) బ్యూరో**

జనగామ జిల్లా నర్మెట్ట మండల రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వానాకాలం-2026 సీజన్‌కు సంబంధించిన విత్తన మేళా ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులకు నాణ్యమైన విత్తనాల వినియోగం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్‌లో అధిక డిమాండ్, మెరుగైన ధరలు లభిస్తున్న నేపథ్యంలో రైతులు సన్న రకాల వరి సాగును విస్తృతంగా చేపట్టాలని సూచించారు. ధృవీకరించిన విత్తనాలను మాత్రమే లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద కొనుగోలు చేసి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని తెలిపారు. విత్తన శుద్ధి, సమతుల్య ఎరువుల వినియోగం, నానో యూరియా, నానో డీఏపీ వంటి శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని పేర్కొన్నారు.
అనంతరం కలెక్టర్, అధికారులు విత్తనాలు, ఎరువుల కంపెనీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి రైతులతో మాట్లాడారు. పంటల ఎంపిక, సాగు విధానాలు, పంట సంరక్షణ చర్యలపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా నర్మెట్ట మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ సబ్‌యార్డ్ మంజూరుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. రైతులకు మెరుగైన మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, రైతులు, విత్తన డీలర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు (AEOలు), వ్యవసాయ శాఖ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## గంజాయి సేవిస్తు పట్టుబడ్డ ముగ్గురిపై కేసు నమోదు

- **వ్యతిరేక కార్యక్రమాలపై సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్ కు తెలపండి**
- **ఎస్ఐ మాచినేని రవి**

**బోనకల్,జూన్ 23,(డీడీ9 వార్త):**

గంజాయి సేవిస్తు పట్టుబడ్డ నలుగురు యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాచినేని రవి తెలిపారు.ఆయన కథనం ప్రకారం ఖమ్మం జిల్లా ఈగిల్ ఫోర్స్ బృందంతో పాటు బోనకల్ ఎస్సై రవి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కలకోట గ్రామ సమీపంలో నిర్వహించిన తనిఖీలలో యంగల కార్తీక్,తోటపల్లి రాహుల్,తోటపల్లి చరణ్ శేఖర్ అలియాస్ టాగూర్ లు గంజాయి సేవించినట్లు గుర్తించినట్లు తెలిపారు.ముగ్గురు వ్యక్తుల యొక్క మూత్ర నమూనాలను డ్రగ్ డిటెక్షన్ కిట్లతో పరీక్షించగా టిఎచ్సి పాజిటివ్‌గా వచ్చిందన్నారు.దీంతో ముగ్గురు నిందితులపై నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మాచినేని రవి తెలిపారు. ఈ సంధర్భంగా ఎస్సై రవి మాట్లాడుతు మండల ప్రజలకు మీ చుట్టుప్రక్కల ప్రాంతంలో ఎవరైనా గంజాయి సేవించడం వంటి చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్ స్టేషన్కు సమాచారం అందించాలని కోరారు,అలాంటి వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




## రేగ కళ్యాణి అక్కపై వ్యక్తిగత విమర్శలు చేయడం నీ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనం

- **ఊరట్టం గ్రామ పంచాయితీ ఉపసర్పంచ్ కాకా రంజిత్**

**తాడ్వాయి మండలం జూన్ 23 (డిడి 9వార్త)**



ములుగు జిల్లా మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కళ్యాణి అక్కను విమర్శించే ముందు నీ స్థాయి, నీరాజకీయ అనుభవం ఎంతో ఒక్కసారి ఆలోచించుకో?
గ్రామ పంచాయితీ సమస్యలపై సరైన అవగాహన లేని నువ్వు జిల్లాస్థాయి నాయకురాలిపై నీస్థాయిని మరిచి విమర్శలు చేయడం నీఅహంకారానికి నిదర్శనం
ప్రభుత్వం అందించిన ORS ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లను ఉపాధి హామీ కూలీలకు నువ్వే స్వంత ఖర్చులతో పంపిణీ చేసినట్లు, ఓ స్వచ్ఛంద సంస్థ నిర్మించిన రామాలయాన్ని నువ్వే కట్టించినట్లు, ప్రభుత్వ నిధులతో వేసిన బోరును నువ్వే వేయించినట్లుగా సోషల్ మీడియాలో ప్రచారం చేసుకోవడం వీటన్నిటినీ గ్రామ పంచాయితీ ప్రజలు 1 ఉన్నారు
గఆత (మీ) బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఇచ్చిన హామీలు 10 సంవత్సరాల కాలంలో ఎన్ని నెరవేర్చారో ముందుగా ప్రజలకు చెప్పగలరా? మంగపేట గూర్చి తర్వాత మాట్లాడుదువు కానీ గత ప్రభుత్వ హయంలో ఊరట్టం గ్రామ పంచాయితీ పరిధిలో జరిగిన ఇసుక అక్రమ రవాణా గూర్చి ముందు తెలుసుకో?
ఇక్కడ జరిగిన ఇసుక దందా ద్వారా మీపార్టీకి చెందిన కొందరు లీడర్లు కోట్లకు ఎదిగిన కఠోర వాస్తవాలను గూర్చి తెలుసుకో?
రైతుల పొలాల్లోకి వాగునీళ్ళు వచ్చి, ఇక్కడి పంట పొలాలు ఇసుకతో నిండి పోవడానికి మీ నాయకులు చేసినా ఇసుక దందానే కారణం అనే విషయాన్ని ముందు తెలుసుకో?
దెయ్యాలు వేదాలు వల్లించినట్లు నీతులు చెబితే వినడానికి ఇక్కడ ఎవ్వరూ సిద్ధంగా లేరనే విషయాన్ని ఇకనైనా గ్రహిస్తే మీకు మంచిది .
కళ్యాణి అక్క అక్రమంగా సంపాదించలేదు వారి భర్త ప్రభుత్వ ఉద్యోగి కష్టపడి కారు కొనుక్కొని ఇల్లు కట్టుకుంటున్నారు
ఒకసారి నువ్వు వెళ్ళి చూడు కామారంలో అందరూ ఉద్యోగస్తులు ఉంటారు. ప్రతిదీ ఇళ్లు భవనాలే ఉంటాయి.అక్రమంగా సంపాదించవు అంటున్నావు కదా నువ్వు నిరూపించకపోతే నీ మీద పరువు దావా నష్టం కింద కేసు వేస్తాం
బడే నాగజ్యోతి ములుగు జిల్లాకు ఏం వెలగబెట్టిందో ములుగు జిల్లా ప్రజానీకానికి తెలుసు
రైతులు పండించిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేసింది రైతుల అకౌంట్లో డబ్బులు కూడా వేసింది ఇందులో కొత్తగా నువ్వు చెప్పేది ఏముంది?
ప్రశ్నలు వాస్తవాల ఆధారంగా, ప్రజా సమస్యలపై ఉంటే సమాధానాలు కూడా హుందాగా ఉంటాయి కానీ వ్యక్తిగత విమర్శలు, బెదిరింపుల రాజకీయాలు చేస్తే, బట్ట కాల్చి మీద వేస్తామని అంటే మాత్రం ప్రజలే మీకు తగిన గుణపాఠం చెబుతారు
శవ రాజకీయాలతో అధికారంలోకి వచ్చిన చరిత్ర ఎవరిదో ప్రజలకు బాగా తెలుసు కాబట్టి చిన్న పెద్ద అనే తేడాను మరిచి, వ్యక్తిగత విమర్శలు చేయడం ఇకనైనా మానుకుంటే నీకు మంచిదని హెచ్చరిస్తున్నాను

## యువతతో కలిసి కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం:బైరి అభిలాష్ పటేల్.

- **మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియామకం... పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు**

**గోవిందరావుపేట, జూన్ 23(డి డి 9 వార్త)**



గోవిందరావుపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన బైరి అభిలాష్ పటేల్ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ యువతను సంఘటితం చేసి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా తనకు బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.తన నియామకానికి సహకరించిన గ్రామాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్, గోవిందరావుపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటకృష్ణ, కాంగ్రెస్ నాయకుడు కొంపల్లి శ్రీనివాస్, మాజీ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు చింత క్రాంతి, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్‌లకు అభిలాష్ పటేల్ ధన్యవాదాలు తెలియజేశారు.
కాంగ్రెస్ పార్టీ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించినందుకు ఎల్లవేళలా పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తానన్నారు. గ్రామ గ్రామాన యువతను కలుపుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని పేర్కొన్నారు.

## గోవిందరావుపేటలో విత్తన మేళా ప్రారంభం.

- **రైతులకు నాణ్యమైన విత్తనాలు, నానో ఎరువులు అందుబాటులో**
- **జూన్ 30 వరకు కొనసాగనున్న మేళా**

**గోవిందరావుపేట, జూన్ 23(డి డి 9 వార్త)**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గోవిందరావుపేట మండలంలోని రైతు వేదికలలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు విత్తన మేళాను ప్రారంభించారు. ఈ మేళా జూన్ 23 నుంచి జూన్ 30, 2026 వరకు కొనసాగనుంది.
ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ లావుడ్య జోగా నాయక్ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బీపీటీ5204, ఆర్ఎన్ఆర్15048, హెచ్ఎంటీ సోనా, శ్రీరామ్, కెఎన్ఎం1638, డబ్ల్యూజిఎల్44, కెఎన్ఎం 7715 వరి విత్తన రకాలను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.
అలాగే పంటల దిగుబడులను పెంచేందుకు నానో యూరియా, నానో డీఏపీ వంటి ఆధునిక ఎరువులు కూడా రైతులకు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు.
కార్యక్రమంలో వ్యవసాయ అధికారి జితేందర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు డి. దాదా సింగ్, సాయి కుమార్, రాధికా తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారులు విజ్ఞప్తి చేశారు.



# రైతుల అభ్యున్నతే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..**

**మణుగూరు.జూన్ 23(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని గుట్ట మల్లారం రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు సదస్సులో పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుని అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఈ నెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న రైతు సదస్సుల ద్వారా రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, అధిక దిగుబడులు సాధించే విధానాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.రైతు భరోసా, రైతు బీమా వంటి పథకాలతో పాటు ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉంచి వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు.రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి అధిక దిగుబడులు సాధించాలని, వ్యవసాయ శాఖ అధికారులు అందిస్తున్న సూచనలు, సలహాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే తెలంగాణ ప్రభుత్వ ధ్యేయమని, "రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుంది" అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

అనంతరం రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలు, సాగునీటి అవసరాలు, విత్తనాలు మరియు ఎరువుల లభ్యతపై వివరాలు తెలుసుకొని సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, రాష్ట్ర నాయకులు, రైతు సమన్వయ సమితి సభ్యులు, రైతులు, గ్రామ ప్రజలు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## క్రికెట్ గ్రౌండ్ సాధనకు యువత ముందడుగు

- **"పస్రా" గ్రామంలో క్రీడా మైదానం కోసం యువకుల కృషి...**
- **యువతకు మెరుగైన వసతులు కల్పించాలని విజ్ఞప్తి**

**గోవిందరావుపేట,జూన్ 23(డిడి 9 వార్త)**

పస్రా గ్రామంలో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు కోసం గ్రామ యువత ముందుకు వచ్చింది. సీనియర్ యువ క్రికెటర్ ముvvా భాను ప్రకాష్ ఆధ్వర్యంలో గ్రామంలోని యువకులు క్రీడా మైదానం అవసరాన్ని గుర్తుచేస్తూ గ్రౌండ్ సాధన కోసం కృషి చేస్తున్నారు. గ్రామంలో క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలపై ఆసక్తి కలిగిన యువత పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ సరైన క్రీడా మైదానం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వారు తెలిపారు. యువత శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని, అందుకు అనువైన స్థలంలో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఈ సందర్భంగా ముvvా భాను ప్రకాష్ మాట్లాడుతూ, గ్రామ యువతలో క్రీడా ప్రతిభకు కొదవ లేదని, సరైన ప్రోత్సాహం, వసతులు కల్పిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించే క్రీడాకారులు తయారవుతారని అన్నారు. గ్రామంలోని యువతంతా ఐక్యంగా క్రీడా మైదానం కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేస్తే యువత క్రీడల వైపు మరింత ఆకర్షితులవడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.



## విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి..

- **మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించిన డీఎస్పీ రవీందర్ రెడ్డి.**

**మణుగూరు.జూన్ 23(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో మంగళవారం నాడు మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మణుగూరు సబ్ డివిజనల్ పోలీసు అధికారి రవీందర్ రెడ్డి హాజరై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ విద్య మరియు క్రీడల యందు దృష్టి సారించాలని,సృజనాత్మక కార్యక్రమాలపై ఆలోచన చేయాలని సూచించారు.మాదకద్రవ్యాల వినియోగం వలన ఆరోగ్యం క్షీణించడం తోపాటు ఉజ్వలమైన భవిష్యత్తు దెబ్బతింటుంది అని ఆయన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ రవీందర్ రెడ్డి, సిఐ నాగబాబు, ఎస్సై రవూఫ్, ఎంఇఓ స్వర్ణజ్యోతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## బస్.. స్టాండా.. చెరువా...? చిన్న చినుకులకే జలమయమైన మంగపేట నూతన బస్టాండ్

**మంగపేట, జూన్ 23 డీడీ 9 వార్త**

మంగపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బస్టాండ్ ప్రారంభం కాకముందే సమస్యలు వెలుగుచూస్తున్నాయి. సోమవారం రాత్రి కురిసిన స్వల్ప వర్షానికే బస్టాండ్ ఆవరణలో భారీగా నీరు నిలిచి చెరువును తలపించే పరిస్థితి ఏర్పడింది.

సెంట్రల్ లైటింగ్, సీసీ రోడ్డు పనులలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైన్లు నిర్మించకపోవడంతో రోడ్డు ఎత్తు పెరిగి, వర్షపు నీరు వెళ్లేందుకు మార్గం లేక బస్టాండ్ ఆవరణలోనే నిలిచిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చిన్న వర్షానికే బస్టాండ్ జలమయమైతే, రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత దారుణంగా మారే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బస్టాండ్‌తో పాటు సమీపంలోని ప్రభుత్వ కార్యాలయాలు, నివాస గృహాలు కూడా ముంపునకు గురయ్యే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

అధికారులు ముందస్తు ప్రణాళిక లేకుండా డ్రైనేజీ వ్యవస్థను విస్మరించడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సరైన డ్రైనేజీ సౌకర్యాలు కల్పించి భవిష్యత్తులో ముంపు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల రద్దుపై భారీ నిరసన..

- **మానవహారం నిర్వహించిన డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న.**

**మణుగూరు.జూన్ 23(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,కొత్తగూడెం టౌన్. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతు,ప్రశ్నాపత్రాల లీకేజీ, పరీక్షల రద్దు ఘటనలకు నిరసనగా డీసీసి అధ్యక్షురాలు శ్రీమతి తోట దేవి ప్రసన్న ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన సభ, మానవహారం కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.కొత్తగూడెం విద్యానగర్ కాలనీ నుంచి సూపర్ బజార్ వరకు కార్యకర్తలతో కలిసి భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు, అనంతరం సూపర్ బజార్ సెంటర్లో మానవహారం గా ఏర్పడి నిరసన తెలియజేశారు. "పేపర్ లీక్ దొంగలను అరెస్ట్ చేయాలి", "విద్యార్థుల కలలను కూల్చొద్దు"," బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోండి" అంటూ నినాదాలు చేశారు. కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే బర్తరఫ్ చేయాలని కోరారు. సంవత్సరానికి రెండు కోట్ల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని ఇచ్చిన హామీని తుంగలో తొక్కుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న మోడీ, విద్యార్థులకు వెంటనే క్షమాపణ చెబుతూ, వెంటనే కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేందర్ ప్రధాన్ ను మంత్రివర్గం నుంచి సస్పెండ్ చేయాలని కోరారు.ప్రతి ఏటా ప్రశ్నాపత్రాలు లీకవడం, లక్షల మంది విద్యార్థులు రాత్రింబవళ్లు కష్టపడి చదివినా పరీక్షలు రద్దవడం దారుణం. ఇది విద్యా వ్యవస్థను నాశనం చేసే కుట్ర. బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి. లీకేజీ వెనుక ఉన్న మాఫియాను కఠినంగా శిక్షించాలి."

"పరీక్ష రాసిన ప్రతి విద్యార్థికి న్యాయం జరగాలి. వాళ్ల కష్టానికి తగ్గ ఫలితం ఇవ్వాలి. రద్దైన పరీక్షలు వెంటనే నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సీసీటీవీ, స్ట్రాంగ్ రూమ్ భద్రత, కఠిన చట్టాలు అమలు చేయాలి" అని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు నిరసన తెలిపారు. ప్రతి విద్యార్థికి అండగా మేమున్నాం అని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా అధ్యక్షులు తోట దేవి ప్రసన్న,డిప్యూటీ మేయర్ సిరిపురం లలిత కుమారి, ప్రసన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, రాష్ట్ర నాయకులు ఆళ్ళ మురళి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గద్దల రమేష్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వై శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు, హనుమంతు,జానీ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఎం ప్రసాద్ బాబు, పైడా రాజేంద్రప్రసాద్,కోధుమూరు శ్రీనివాస్ లోశెట్టి నాగార్జున, జిల్లా కార్యదర్శులు నూకల రంగారావు, అంతోటి పౌల్, కొత్తగూడెం టౌన్, చుంచుపల్లి సుజాతనగర్, లక్ష్మీదేవి పల్లి పాల్వంచ మండలాల అధ్యక్షులు పరమేష్ యాదవ్, భువన సుందర్ రెడ్డి, అజయ్ కుమార్, సునీల్, దేవరగట్ల ప్రసాద్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు సత్తిరెడ్డి, చింతలపూడి రాజశేఖర్, నాగేశ్వరరావు, కార్పొరేటర్లు, సర్పంచులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## పట్టణ రుచులు పల్లెల్లోకి..,

- **ఊరూరు వెలుస్తున్న స్వీట్ హౌస్ లు, బేకరీలు**

**ములుగు, డీ డీ 9 వార్త :**

పట్టణ రుచులు పల్లెల్లోకి వ్యాపిస్తున్నాయి.., స్వీట్లు అంటే తెలియని పల్లెల్లో రాజస్థాన్ కు చెందిన వ్యాపారులు స్వీట్ హౌస్ లు, బేకరీలు ఏర్పాటు చేసి, వాటి రుచులు పంచుతున్నారు. అందులో భాగంగానే ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట గ్రామంలో ఇటీవల రాజస్థాన్కు చెందిన వ్యాపారులు మామాజీ స్వీట్ హౌస్, బేకరీల పేరుతో వ్యాపారం మొదలుపెట్టారు. వివిధ రకాలైన స్వీట్లను, బేకరీ ఫుడ్ ను అందుబాటులో ఉంచి ప్రజలకు విక్రయిస్తున్నారు. దీనికి తోడు రుచికరమైన సమోసాలు, పకోడీ వేడివేడిగా తయారు చేసి గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు.



## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ స్వాధీనం..

- **వ్యక్తి పై కేసు నమోదు**

**బోనకల్,జూన్ 23 (డీడీ9వార్త):**




ఆంధ్ర నుంచి తెలంగాణకు రాత్రి సమయంలో మండలంలోని చొప్పకట్లపాలెం గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం మేరకు ఎస్సై మాచినేని రవి ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజామున పోలీసులు దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన తుపాకుల నరేష్ తన ట్రాక్టర్‌పై అక్రమంగా ఇసుక రవాణా చేస్తూ పట్టుబడ్డాడు.పోలీసులు ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అనంతరం అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై రవి తెలిపారు, ఈ సందర్భంగా ఎస్సై రవి మాట్లాడుతు అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అలాగే ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న వారి సమాచారాన్ని వెంటనే బోనకల్ పోలీసులకు అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కరకగూడెం మండలంలోని రైతు వేదికలలో విత్తనమేళా

- **స్టాల్స్ ఏర్పాటుచేసిన డీలర్స్**
- **రైతులకు ఆహ్వానం**

**కరక గూడెం జూన్ 23 (డి డి 9 వార్త):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం లోని రైతు వేదికలలో రైతుల కోసం విత్తనమేళా నిర్వహించనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఏవో చటర్జీ మాట్లాడుతూ వానాకాలం సాగు సీజన్లో దృష్టిలో ఉంచుకొని నాణ్యమైన విత్తనాలు రైతులకు సకాలంలో అందేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మండలంలోని వివిధ రైతు వేదికల వద్ద వరి ,మొక్కజొన్న,పత్తి,పప్పు ధాన్యాలు, విత్తనాలతో పాటు ఇతర పంటలకు సంబంధించిన విత్తనాలు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు.రైతులు భూమి స్వభావం నీటి వసతి పంట కాలాన్ని బట్టి సరైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. రైతులు నానో యూరియా మరియు నానో డీఏపీలను వాడాలని సూచించారు.

విత్తనాలు కొనుగోలు సమయంలో రైతులు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని పాకెట్ పై ఉన్న లాట్ నెంబర్ గడువు తేదీ మొలక శాతం తదితర వివరాలను పరిశీలించాలని అధికారులు సూచించారు నకిలీ విత్తనాల బారిన పడకుండా గుర్తింపు పొందిన విక్రయ కేంద్రాల నుంచి విత్తనాలు కొనుగోలు చేయాలని కోరారు.

రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విత్తనాలను పొందాలని సందేహాల కోసం వ్యవసాయ విస్తరణ విస్తరణ అధికారులను సంప్రదించాలని కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, గ్రామ పెద్దలు అధికారులు పాల్గొన్నారు




## ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మర్యాదపూర్వకంగా కలిసిన మణుగూరు ఎంపీడీవో ఎం. శ్రీకాంత్..

**మణుగూరు.జూన్ 23 (డి డి 9వార్త)**

మణుగూరు మండల ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎం. శ్రీకాంత్ మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక నియోజకవర్గ శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లుని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శ్రీకాంత్ కి శుభాకాంక్షలు తెలియజేసి, మండల అభివృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సంక్షేమ పథకాల అమలులో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.అలాగే ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతంగా అమలవుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీవో శ్రీకాంత్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలియజేసి, మండల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## మంగ పేటలో పాస్‌పోర్ట్ పోగొట్టుకున్న యువకుడు

**మంగపేట,జూన్ 23డీడీ 9 వార్త**

ములుగు జిల్లా మంగపేట మండలంలోని రామచంద్రునిపేట గ్రామానికి చెందిన చౌలం రక్షక్ దేవ్ తన భారతీయ పాస్‌పోర్ట్ పోగొట్టుకున్నట్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, పాస్‌పోర్ట్ నంబర్ S9235422 కలిగిన తన భారతీయ పాస్‌పోర్ట్ ఈ సంవత్సరం మే 20వ తేదీన తన సోదరుడి నిశ్చితార్థ కార్యక్రమం సందర్భంగా కనిపించకుండా పోయింది. ఆ రోజు తాను వెళ్లిన అన్ని ప్రాంతాల్లో, అలాగే తన నివాసంలో విస్తృతంగా వెతికినా పాస్‌పోర్ట్ ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. పాస్‌పోర్ట్ దొరికిన పక్షంలో దానిని సమీప పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలనీ లేదా నేరుగా తనను సంప్రదించాలని ఆయన కోరారు.

సంప్రదించవలసిన వివరాలు:
పేరు: చౌలం రక్షక్ దేవ్
ఫోన్ నంబర్: 7207757431




పాస్‌పోర్ట్ వంటి ముఖ్యమైన పత్రం ఎవరికైనా లభించినట్లయితే బాధ్యతాయుతంగా వ్యవహరించి సంబంధిత వ్యక్తికి లేదా పోలీసులకు అప్పగించాలని స్థానికులు కోరుతున్నారు.





## బుగ్గ చెరువు షట్టర్ రిపేరు వృథాగా పోతున్న సాగునీరు..

- 220 ఎకరాల రైతుల భవిష్యత్తుపై నీటి సంక్షోభం ముప్పు..
- అధికారుల నిర్లక్ష్యంతో ఆవిరైపోతున్న రైతుల ఆశలు.
- గ్రామసభలో ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులు..
- బుగ్గ చెరువు మరమ్మతులు చేపట్టాలని రైతుల ఆందోళన...

**మణుగూరు.జూన్ 23(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,కరకగూడెం మండలం, పద్మాపురం గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న బుగ్గ చెరువులో ఒక తూము వద్ద షట్టర్ దెబ్బతినడంతో చెరువులో నిల్వ ఉన్న నీరు వృథాగా బయటకు పోతుండటంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువ కింద సాగు చేస్తున్న రైతులు ఈ సమస్య కారణంగా భవిష్యత్తులో తీవ్ర నీటి కొరత ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రైతు సలుగు బిక్షపతి మాట్లాడుతూ బుగ్గ చెరువు కాలువ కింద సుమారు 220 ఎకరాల సాగుభూమి ఉందని తెలిపారు. ప్రస్తుతం చెరువులో ఉన్న నీరు షట్టర్ దెబ్బతినడం వల్ల నిరంతరం బయటకు పోతుండటంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు.గ్రామసభలో కూడా అధికారులకు లిఖితపూర్వకంగా దరఖాస్తు అందజేసినా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టకపోవడం విచారకరమని పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతుల సమస్యలు మరింత పెరుగుతున్నాయని అన్నారు. త్వరలో తీర పంటల సాగు ప్రారంభమయ్యే సమయంలో చెరువులో నీటి నిల్వలు తగ్గిపోతే పంట పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి లభ్యత లేకపోతే దిగుబడులు తగ్గడంతో పాటు రైతులు ఆర్థికంగా నష్టపోయే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి దెబ్బతిన్న షట్టర్‌ను మరమ్మతు చేయాలని రైతులు కోరుతున్నారు. చెరువులోని నీటిని సంరక్షించి సాగునీటి అవసరాలకు వినియోగించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమస్యను అధికారులు అత్యవసరంగా పరిగణించి పరిష్కరిస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## రైతు వేదికల్లో వారం రోజుల పాటు 'విత్తన మేళా'

**మంగపేట, జూన్ 23డీడీ 9 వార్త**

వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతు సోదరులకు నాణ్యమైన, ధృవీకరించిన విత్తనాలను ఒకే చోట అందుబాటులో ఉంచేందుకు మంగపేట మండల వ్యవసాయ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. మండలంలోని అన్ని రైతు వేదికల కేంద్రంగా జూన్ 23వ తేదీ నుండి జూన్ 30వ తేదీ వరకు 'విత్తన మేళా'ను నిర్వహిస్తున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

**సన్న రకాల సాగుపై ప్రత్యేక దృష్టి**

ఈ వానాకాలం సీజన్‌లో రైతులు లాభసాటిగా ఉండేందుకు ప్రభుత్వం సన్న రకం వరి సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తోంది. ఇందులో భాగంగా, రైతులు సాగులో నాణ్యతను పాటించాలని, ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న వడ్లను మాత్రమే ఎంచుకోవాలని అధికారులు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఈ ఏడు రకాలను సాగు చేసిన రైతులకు మాత్రమే, పంట కొనుగోలు సమయంలో క్వింటాలుకు అదనంగా బోనస్ చెల్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు.

**బోనస్ వర్తించే ఏడు రకాల సన్న వడ్లు ఇవే:**

రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ఈ కింది రకాలను మాత్రమే ఎంచుకోవాలని అధికారులు కోరారు.బి.పి.టి5204,ఆర్.ఎన్.ఆర్ 15048,హెచ్.ఎమ్.టి సోనా, కె.ఎన్.ఎమ్ 1638,జైశ్రీరామ్,డబ్ల్యూ.జి.ఎల్ 44,కె.ఎన్.ఎమ్ 7715**

**రైతులకు అధికారుల సూచనలు:**

మండలంలోని రైతు సోదరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ కోరుతోంది. రైతులు తమ పరిధిలోని రైతు వేదికలను సందర్శించి, విత్తన మేళాలో నాణ్యమైన విత్తనాలను సేకరించుకోవాలని సూచించారు. విత్తనాల ఎంపిక, సాగు పద్ధతులు మరియు ఇతర వ్యవసాయ సంబంధిత సందేహాల కోసం స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు.



ఈ విత్తన మేళా ద్వారా రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించడమే కాకుండా, నకిలీ విత్తనాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని అధికారులు తెలిపారు.

## డి సీల్టింగ్ ఇసుక క్వారీ లు నిలిపి వేయకుంటే పోరాటం తప్పదు

- గోదావరి నది భూగర్భ జలాల ధ్వంసం కోసమే ఇసుక మాఫియా డి సీల్టింగ్ కుట్రలు
- ఏటూరు నాగారం వన్య ప్రాణి సంరక్షణ కేంద్రం లో ఇసుక లారీలు అర్ధరాత్రి కూడ నడుస్తుంటే జిల్లా కలెక్టర్ DFO ఏం చేస్తున్నారో సమాధానం చెప్పాలి
- గిరిజన సొసైటీ లపై ఆధిపత్యం చెలాయిస్తూ నేనే రాజు నేనే మంత్రి అనే అధికార పార్టీ నేతలపై ప్రజా పోరాటం తప్పదు
- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డా.అరుణ్ కుమార్ తీవ్ర హెచ్చరిక

**మంగపేట జూన్ 23డీడీ 9 వార్త**

ములుగు జిల్లాలో గోదావరి నది పరివాహక ప్రాంతం లో భారత రాజ్యాంగ చట్టాలు హక్కులు అటవీ శాఖ నిబంధనలు అమలు అయ్యే పరిస్థితి లేదు ఈ క్రమం లో అక్రమ ఇసుక త్రవ్వాకాలపై తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మహిపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలో ఇసుక మాఫియా ఆగడాలు రోజురోజుకు మితిమీరిపోతున్నాయని నిబంధనలు తుంగలో తొక్కుతూ చట్టాలను ఉల్లంఘిస్తూ ఏటూర్ నాగారం వన్య పాణి సంరక్షణ కేంద్ర నిబంధనలు అతిక్రమిస్తూ పగలు రాత్రి తేడా లేకుండా ఇసుక లారీలు నడుస్తూ అనేక అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని అయినప్పటికీ కూడ చట్టాలను కాపాడాల్సిన జిల్లా కలెక్టర్ అటవీని, అటవీ ప్రాంతాన్ని సంరక్షించాల్సిన జిల్లా అటవీ శాఖ అధికారి ఏజెన్సీ ప్రాంత చట్టాలను వనరులను కాపాడాల్సిన ఐటిడిఎ పీవో ఏమాత్రం పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

కేవలం పగలు మాత్రమే నడవాల్సిన ఇసుక క్వారీలు పగలు రాత్రి తేడా లేకుండా ఎలా నడుస్తాయని అన్నారు అడవిలో అనేక రకాల జంతుజాలం జీవజాలం ఉంటుందని అందులో వేగంగా పరిగెత్తే జంతువులు ఉంటాయి. నిదానంగా ప్రయాణించే జీవులు ఉంటాయి. అవి రాత్రి సమయం లో రోడ్డు దాటి సంచరించే క్రమంలో ఆ లారీల కింద పడి ఎన్ని జంతువులు నలిగిపోతున్నాయో అధికారులకు తెలియద అని మండిపడ్డారు అందుకే వన్యపాణి సంరక్షణ నిబంధనల ప్రకారం భారీ వాహనాలు రాత్రి 9 గంటల నుంచి తెల్లవారుజామున 6 గంటల వరకు నిషేధించాలని నియమాలు వారికి తెలియదా అని ఘాటుగా ప్రశ్నించారు

గిరిజన సొసైటీల పేరిట ఇసుక తవ్వకాలు సరిపోక ఇటీవల కాలంలో గోదావరి నది భూగర్భ జలాలను దెబ్బ తీయడానికి రానున్న కాలంలో గోదావరి నదిని అందులో నీటిని లేకుండా చేయడానికి ఇసుక మాఫియా కుట్రలు పన్నిందని దాన్లో భాగంగానే ఎక్కడో కట్టే సీతారామ ప్రాజెక్టు వలన బ్యాక్ వాటర్ స్టోరేజ్ ఏటూరు నాగారం వరకి విస్తరించి ఉంటుందని దొంగ నివేదికలు సమర్పించి అక్రమంగా అందులో ఉన్న ఇసుకను డీసీల్టింగ్ పేరిట కొత్త క్వారీలకు అనుమతిని ఇచ్చి ఇసుకను ఎత్తుకుపోతున్నారని అన్నారు. ఇసుక కాంట్రాక్టర్ల ఎంగిలి మెతుకులకు పర్యావరణ,భూగర్భ శాఖ మోకరిల్లి ఈ ప్రాంత వినాశన అనుమతులు మంజూరు చేశాయని మండి పడ్డారు. దీని ద్వారా భవిష్యత్తులో గోదావరి నది ఎండిపోవడమే కాకుండా గోదారి పరివాహక ప్రాంతంలో వాగులు వంకలు ఊట బావులు నీటి చెలిమలు అంతరించి పోవడమే గాక చెట్లు అడవులు నీరు అందక అంతరిస్తాయని అన్నారు జీవజాలం జంతుజాలం నీటి శాతం అందక అంతరిస్తాయని దానితో ఆదిమ తెగలు అంతరించే ప్రమాదం పొంచి ఉంది అన్నారు

ఇసుక లారీల అధిక లోడు అధిక స్పీడ్ కి అంతే లేదు అన్నారు అనేక మంది ఆదివాసీలు ఆ లారీల కింద పడి ముక్కలు ముక్కలు అవుతున్నారని అన్నారు అనేక పశువులు జంతువులు నెత్తురోడుతునాయని అన్నారు కనీసం పర్యా విక్షణ లేదు అని అన్నారు అనేక క్వారీలు ఆదివాసీల సొసైటీ ల నిబంధనలకు విరుద్ధంగా బినామీల పేరిట నడుస్తున్నాయి అని అన్నారు బినామీ వ్యవస్థ తో గోదావరి తల్లి గోసరిల్లుతుంది అన్నారు.

సొసైటీ యాక్ట్ ప్రకారం కేవలం ఇసుక త్రవకం మానువల్ గా జరగాలి కానీ కూలీలు ట్రాక్టర్ ల ద్వార గోదావరి నది లో ఇసుక బయట ఒడ్డు పై పోసినాక ఇసుక అమ్మకం చేయాలి కాని నేడు ఏకంగా గోదావరి నదిలోకి బారి ప్రోక్లియర్ లు లారీ లు వెళ్ళి గోదావరి సారూప్యాన్ని ద్వంసం చేస్తూ నిబంధనలు అతిక్రమించిన అధికారులు మాట్లాడే పరిస్తితి లేదు అన్నారు

2016 నుండి 2026 వరకు నేటి వరకు ఆదివాసీలకు 64 ఇసుక క్వారీల లో రావలసిన 40 పర్సంట్ నిధి వాట 10 ఏళ్లు అయిన నేటికి ఇవ్వడం చేత కాని ప్రభుత్వం డి సీల్టింగ్ కి అనుమతి ఎలా ఇస్తుందని అన్నారు ఆదివాసీల సొసైటీ కి రావాల్సిన వాట కోసం పోరాటం చేస్తాం అన్నారు అధికార పార్టీ నేతల్లో ముఖ్య నేతలు అధికారం ఉంది కదా అని గిరిజన సొసైటీ ల నిర్ణయాలు లేకుండా వారి అభిప్రాయాలు పరిగణలోకి తీసుకోకుండా వారి యొక్క లాభ పెక్ష ను దెబ్బ తీస్తూ జులుం ప్రదర్శన చేస్తూ నేనే రాజు నేనే మంత్రి అన్న చందంగా వ్యవహరిస్తున్నారని ఆదివాసీలు కు ప్రాతి నిత్యం లేకుండా చేస్తున్న ఆ నేతలు పద్ధతి మార్చుకోక పోతే త్వరలో బహిరంగ ప్రజా పోరాటం ఉంటుంది తుడుందెబ్బ హెచ్చరించింది అక్రమ ఇసుక మాఫియా ఆగడాలను ఇక సహించేది లేదు అని నిబంధనలకు విరుద్ధంగా చట్ట వ్యతిరేకంగా నడిచే క్వారీలు, డి సీల్టింగ్ పేరిట అక్రమం ఇసుక క్వారీల భరతం పడతామని అన్నారు, రాత్రి 10 తరువాత ఇసుక లారీలు నడిస్తే ఊరుకునేది లేదు అన్నారు మీ రెవెన్యూ నిధి కోసం మా ప్రాంతం యొక్క రక్తం పీల్చుకు తింటాం అంటే ఊరుకునేది లేదు అన్నారు త్వరలో ఇసుక మాఫియా ఆగడాలపై ఉద్యమ కార్య చరణ తుడుందెబ్బ ఆధ్వర్యం లో చేపడతాం అన్నారు



## బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

- ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్
- ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో మీడియా సమావేశంలో వాస్తవాలు వెల్లడించిన నాయకులు

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లాలో ఇసుక సరఫరాలో 4 కోట్ల అవినీతి చేశారన్న బిఆర్ఎస్ నాయకుల మాటలు అవాస్తవం అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో ఆయన మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.., ఇసుక అక్రమ రవాణా జరిగి ఉంటే ఆధారాలతో ఎందుకు ముందుకు రావడం లేదనీ ప్రశ్నించారు. సీతమ్మ ప్రాజెక్ట్ లో ప్రజలు నష్టపోతున్నారని అవాస్తవాలు మాట్లాడం సబబు కాదన్నారు. వారు చేస్తున్న తప్పుడు ఆరోపణలు,వాస్తవాలకు ఆధారాలతో సహా మీడియా సాక్షిగా వివరించారు. గతంలో మీరు 10 సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ములుగు జిల్లాలో చేయలేని అభివృద్ధి మంత్రి సీతక్క కృషి వల్ల ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయనీ. మీరు ప్రతిపక్షంలో ఉన్నారు జరుగుతున్న అభివృద్ధికి సహకరించండి అంతే కానీ మంత్రి సీతక్క చేసే అభివృద్ధి పనులకు ఓర్వలేక తప్పుడు ప్రచారాలు చేసి ప్రజల్లో చులకన కావద్దని వారికి సూచించారు.. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, కిసాన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ పల్లె జైపాల్ రెడ్డి యూత్ నాయకులు,వివిధ మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు, చైర్మన్లు, డైరెక్టర్లు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ఆపదలో ఉన్న కుటుంబానికి గ్రామస్తుల చేయూత

- రమేష్ కుటుంబానికి కొండాపూర్ గ్రామస్తుల అండ

**జనగామ జూన్ 23(డిడి 9వార్త)బ్యూరో**

ఆపదలో ఉన్న కుటుంబానికి గ్రామస్తులు అండగా నిలిచి మానవత్వాన్ని చాటారు. కొండాపూర్ గ్రామానికి చెందిన గుండె బోయిన రమేష్ (కొమురయ్య కుమారుడు) కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న గ్రామ పెద్దలు, యువత, దాతలు స్పందించి విరాళాలు సేకరించారు. గ్రామ ప్రజల సహకారంతో మొత్తం రూ.47,100 సేకరించి మంగళవారం రమేష్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, కష్టకాలంలో ఒకరికొకరు తోడుగా నిలవడం గ్రామ సంప్రదాయమని పేర్కొన్నారు. సహాయం అందుకున్న రమేష్ కుటుంబ సభ్యులు గ్రామ ప్రజల ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో ఎవరికైనా ఆపద వస్తే అందరూ కలిసి సహాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన రాజారపు ప్రతాప్: చింతకింది కృష్ణమూర్తి

**జనగామ జూన్ 23 (డిడి 9 వార్త ) బ్యూరో**

నీతి, నిజాయితీకి మారుపేరుగా నిలిచిన స్వర్గీయ రాజారపు ప్రతాప్ సేవలు చిరస్మరణీయమని సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా ఇన్‌చార్జి చింతకింది కృష్ణమూర్తి అన్నారు. ధర్మసాగర్ మండలం పెద్దపెండ్యాల గ్రామంలోని ఆర్‌కే గార్డెన్‌లో నిర్వహించిన ప్రతాప్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాలుగు దశాబ్దాల పాటు సామాజిక సేవలో విశేష కృషి చేసిన ప్రతాప్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసి ప్రజల మనిషిగా గుర్తింపు పొందారని




కొనియాడారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, సామాజిక సేవకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

**గోవిందరావుపేట, జూన్ 23(డిడి 9వార్త)**

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైద్య ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి, మెరుగైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల తీసుకునే జాగ్రత్తల గురించి గ్రామాలలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మలేరియా, డెంగ్యూ, డయేరియా ఇలాంటి వ్యాధులను నియంత్రించాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రానికి రోజువారి వైద్య సేవలు ఏ విధంగా అందుతున్నాయని, ఏ రకమైన వ్యాధులతో బాధపడుతున్న వారు వస్తున్నారని వివరాలను అడిగి



తెలుసుకున్నారు. తదనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ టెక్నీషియన్, మందుల నిల్వలు గదిని, టీకాలు నిల్వల గదులను పరిశీలించినారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనూష, ఫార్మసిస్ట్ అనుష ల్యాబ్ టెక్నీషియన్ సందీప్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## సీతక్కని విమర్శిస్తే సహించేది లేదు

- తప్పుడు ప్రచారాన్ని బిఆర్ఎస్ మానుకోవాలి
- జంగాలపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రుద్రోజు జగన్నాథ చారి

**డీ డీ 9 వార్త, ములుగు :**

ములుగు జిల్లా అభివృద్ధితో పాటు తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో కీలక నేతగా ఎదుగుతున్న పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సరికాదని జంగాలపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు రుద్రోజు జగన్నాథ చారి అన్నారు. సీతక్క ఎదుగుదలను, కాంగ్రెస్ పార్టీ బలోపేతాన్ని జీర్ణించుకోలేని బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అభివృద్ధి



పథంలో నడిపిస్తున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు మంత్రి సితక్క తో పాటు ఇతర నాయకులను విమర్శించడం మానుకోవాలని హెచ్చరించారు.

## టీఆర్‌పీలో భారీ చేరికలు.. తీన్మార్ మల్లన్న సమక్షంలో నాయకుల చేరిక

**జనగామ జూన్ 23(డిడి 9వార్త )బ్యూరో**

తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్‌పీ) రాష్ట్ర కార్యాలయంలో పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న సమక్షంలో, జనగామ జిల్లా అధ్యక్షుడు కట్ల సదానందం ముదిరాజ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు టీఆర్‌పీలో చేరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల రాజకీయ హక్కులు, సామాజిక న్యాయం కోసం టీఆర్‌పీ చేస్తున్న పోరాటాన్ని విశ్వసించి టీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరినట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని కొత్తగా చేరిన నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రేణుగుంట్ల మురళి బైండ్ల, జిల్లా యూత్ అధ్యక్షుడు పిట్టల సురేష్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చెన్నూరు వంశీ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పానుగంటి నర్సింగరావు, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు గంగరాజు తదితరులు పాల్గొన్నారు.





## సేవ్ సింగరేణి, సేవ్ మణుగూరు కార్యక్రమానికి సంఘీభావంగా మద్దతు తెలిపిన లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు..

**మణుగూరు.జూన్ 23(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు లయన్స్ క్లబ్ మణుగూరు ఆధ్వర్యంలో సేవ్ మణుగూరు సేవ్ సింగరేణి కార్యక్రమానికి సంఘీభావంగా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో సభ్యులు దీక్ష శిబిరానికి చేరుకొని వారికి మద్దతు తెలిపి మాట్లాడారు ఎలెక్ట్ ప్రెసిడెంట్ దొ బ్బల వెంకటప్పయ్య, ఎలక్ట్ సెక్రెటరీ కత్తి రాములు మాట్లాడుతూ... మణుగూరు ప్రాంతానికి అస్తిత్వమైన సింగరేణిని ప్రైవేట్ పరం చేయడం మణుగూరు అభివృద్ధికి గొడ్డలి పెట్టు అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించాలన్న, మణుగూరు భవిష్యత్తు బంగారు మయం కావాలన్నా సింగరేణిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నది అన్నారు. సింగరేణి ప్రైవేటుపరం అయితే వేలాదిమంది కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సింగరేణి ఉద్యోగుల బతుకులు వీధిన పడతాయి అన్నారు. కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఈ ప్రైవేటీకరణ ప్రక్రియను పున సమీక్షించి సింగరేణిని రక్షించాలన్నారు ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ మణుగూరు డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ జివల్లి కోఆర్డినేటర్ గాజుల రమేష్ కుమార్ ఆడ బాల నాగేశ్వరరావు లైన్స్ క్లబ్ మణుగూరు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామం పీరీల వారి పెళ్లికి ప్రధానానికి హాజరు అయినావారు

**తాడ్వాయి మండలంజూన్ 23 (డిడి 9వార్త )**

తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామంలో పీరీల లక్ష్మి లక్ష్మయ్య కుమార్తె పీరీల రూప పెళ్లి ప్రాధనం కు స్థానిక మాజీ సర్పంచ్ సిద్దబోయిన శ్రీనివాస్ సిద్ధబోయిన హనుమంతరావు ఆధ్వర్యంలో ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్, మాజీ ఎంపిటిసి సొలం వెంకన్న, జర్నలిస్ట్ ల ఫోరమ్ జిల్లా కో కన్వినర్ గొంది లక్ష్మణమూర్తి యూత్ జేఏసీ నాయకులు సొలం రాంబాబు తదితరులు హాజరు అయ్యారు



## ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనకు బయల్దేరిన టీమిండియా

- టీ20 ప్రపంచకప్ తర్వాత శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో తొలి సిరీస్
- సచిన్ రికార్డును బద్దలు కొట్టి జట్టులోకి వచ్చిన 15 ఏళ్ల వైభవ్
- వన్డే జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్.. తిరిగి జట్టులోకి విరాట్ కోహ్లీ
- సిరాజ్ స్థానంలో ప్రసిధ్ కృష్ణ.. జట్టులోకి హర్షిత్ రాణా, రవి బిష్ణోయ్




**డిడి9 వార్త:**

టీ20 ప్రపంచకప్ విజయం తర్వాత భారత క్రికెట్ జట్టు మరో సుదీర్ఘ పర్యటనకు సిద్ధమైంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని యువభారత్.. ఐర్లాండ్, ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్‌లు ఆడేందుకు చెన్నై అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరి వెళ్లింది. ఈ పర్యటన ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుంది. ఈ టూర్‌లో భాగంగా భారత్ రెండు టీ20లు, ఎనిమిది వన్డేలు ఆడనుంది.

ఈ పర్యటనలో భాగంగా తొలుత ఐర్లాండ్‌తో డబ్లిన్‌లో జూన్ 26, 28 తేదీల్లో రెండు టీ20 మ్యాచ్‌లు ఆడుతుంది. టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత్ ఆడుతున్న తొలి టీ20 సిరీస్ ఇదే కావడం విశేషం. 2028లో జరగనున్న లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్, ఆస్ట్రేలియాన్యూజిలాండ్‌లో జరిగే తదుపరి టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని, పొట్టి ఫార్మాట్‌లో ఇది భారత జట్టుకు ఒక కొత్త అధ్యాయంగా భావిస్తున్నారు.ఈ పర్యటనలో ప్రధాన ఆకర్షణగా 15 ఏళ్ల 71 రోజుల వయసున్న యువ బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీ నిలిచాడు. తద్వారా 36 ఏళ్ల క్రితం సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన రికార్డును బద్దలు కొట్టి, భారత పురుషుల క్రికెట్ జట్టుకు ఎంపికైన అత్యంత పిన్న వయస్కుడిగా చరిత్ర సృష్టించాడు. అతనితో పాటు ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన చేసిన అన్‌క్యాప్డ్ ఫాస్ట్ బౌలర్ ప్రిన్స్ యాదవ్ కూడా తొలిసారిగా సీనియర్ టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు.

సీనియర్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను మొదట జట్టులోకి ఎంపిక చేసినప్పటికీ, అతని స్థానంలో ప్రసిధ్ కృష్ణను తీసుకున్నారు. అలాగే, గాయం నుంచి కోలుకున్న సీమ్‌బౌలింగ్ ఆల్‌రౌండర్ హర్షిత్ రాణా, లెగ్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ తిరిగి జట్టులోకి వచ్చారు. ఐర్లాండ్ పర్యటన ముగిశాక, ఇదే జట్టు ఇంగ్లండ్‌తో జులై 1 నుంచి 11 వరకు ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది.

టీ20 సిరీస్ అనంతరం జులై 14 నుంచి 19 వరకు ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ వన్డే జట్టుకు శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా, శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ సిరీస్‌తో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తిరిగి జట్టులోకి రానున్నాడు. ఐపీఎల్ 2026లో తొడ కండరాల గాయంతో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌కు దూరమైన కోహ్లీ, ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే తుది జట్టులో ఆడతాడని బీసీసీఐ స్పష్టం చేసింది.

# ఐపీఎల్‌లో సంచలనం: భారీ జీతం వదులుకుని సొంతగూటికి పంత్.. లక్నోకు కుల్దీప్

- సొంత జట్టు ఢిల్లీ క్యాపిటల్స్‌కు తిరిగి వచ్చిన రిషబ్ పంత్
- లక్నో సూపర్ జెయింట్స్ నుంచి కీలకమైన ప్లేయర్ ట్రేడ్
- రూ. 27 కోట్ల జీతాన్ని వదులుకుని రూ. 15 కోట్లకు ఒప్పందం
- పంత్‌కు బదులుగా లక్నో జట్టులోకి వెళ్లిన స్పిన్నర్ కుల్దీప్ యాదవ్
- ఐపీఎల్ చరిత్రలోనే ఇది అతిపెద్ద ట్రేడ్‌లలో ఒకటని ప్రకటన



**డిడి9 వార్త:**

ఐపీఎల్ చరిత్రలోనే ఒక కీలకమైన ప్లేయర్ ట్రేడ్ జరిగింది. లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) మాజీ కెప్టెన్ రిషబ్ పంత్, తన పాత జట్టు అయిన ఢిల్లీ క్యాపిటల్స్ (డీసీ) గూటికి తిరిగి చేరాడు. ఈ బ్లాక్‌బస్టర్ ట్రేడ్ ఒప్పందంలో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ లక్నో జట్టులోకి బదిలీ అయ్యాడు. ఈ మార్పును ఐపీఎల్ యాజమాన్యం ధ్రువీకరించింది.

రెండు సీజన్ల క్రితం రికార్డు స్థాయిలో రూ. 27 కోట్లకు లక్నో జట్టు పంత్‌ను కొనుగోలు చేసింది. కానీ ఆటగాడిగా, కెప్టెన్ గా ఆశించిన స్థాయిలో రాణించలేదు. దాంతో జట్టులో అతడి స్థానం ప్రశ్నార్థకమైంది. ఈ క్రమంలోనే ట్రేడింగ్ చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది. అయితే, సొంత జట్టు ఢిల్లీకి తిరిగి వచ్చేందుకు పంత్ తన జీతంలో భారీగా కోత విధించుకోవడం గమనార్హం. ఢిల్లీ క్యాపిటల్స్‌లో పంత్ ఏడాదికి రూ. 15 కోట్లు అందుకోనున్నాడు. మరోవైపు కుల్దీప్ యాదవ్ రూ. 13.50 కోట్ల కాంట్రాక్ట్‌పై లక్నోతో చేరాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అత్యంత ముఖ్యమైన ట్రేడ్‌లలో ఒకటని ఐపీఎల్ మీడియా ప్రకటనలో పేర్కొంది.

2025 సీజన్‌లో లక్నో ఫ్రాంచైజీకి కెప్టెన్‌గా ఎంపికైన పంత్, రెండేళ్ల పాటు ఆ జట్టుతో నిరాశాజనకమైన ప్రదర్శన కనబరిచాడు. 2025, 2026 సీజన్లలో అతను వరుసగా 269, 312 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఓపెనర్‌గా, ఫినిషర్‌గా వివిధ బ్యాటింగ్ స్థానాల్లో ప్రయత్నించినప్పటికీ, తన రికార్డు ధరను ఏమాత్రం సమర్థించుకోలేకపోయాడు. 2026 ఐపీఎల్‌లో పేలవ ప్రదర్శన తర్వాత లక్నో కెప్టెన్సీ నుంచి కూడా తప్పుకున్నాడు.

పంత్ తన ఐపీఎల్ కెరీర్‌ను 2016లో ఢిల్లీ ఫ్రాంచైజీతోనే ప్రారంభించాడు. 2024లో ఆ జట్టును వీడే వరకు కీలక ఆటగాడిగా కొనసాగాడు. ఢిల్లీ తరఫున అత్యధికంగా 111 మ్యాచ్‌లు ఆడిన రికార్డు పంత్ పేరిట ఉంది. దాదాపు దశాబ్ద కాలం పాటు జట్టుకు ముఖ్య ఆటగాడిగా ఉంటూ, 2021 నుంచి 2024 వరకు నాలుగు సీజన్ల పాటు 43 మ్యాచ్‌లకు కెప్టెన్‌గా వ్యవహరించాడు.

ఇక, కుల్దీప్ యాదవ్ విషయానికొస్తే, ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఐదు సీజన్ల పాటు విజయవంతంగా కొనసాగాడు. 2022లో జట్టులో చేరినప్పటి నుంచి 65 మ్యాచ్‌లలో 72 వికెట్లు పడగొట్టి టోర్నమెంట్‌లో అగ్రశ్రేణి స్పిన్నర్లలో ఒకడిగా నిలిచాడు. ప్రస్తుతం ఢిల్లీలో రూ. 13.25 కోట్లు అందుకుంటున్న కుల్దీప్, లక్నోకు మారడంతో జీతంలో స్వల్ప పెరుగుదల పొందాడు.

# అమ్మ నగలమ్మి కిట్ కొనిచ్చింది.. నా క్రికెట్ ప్రయాణం వెనుక ఆమె త్యాగం ఉంది: భారత పేసర్ క్రాంతి గౌడ్

- క్రికెట్ కిట్ కోసం తన తల్లి నగలు అమ్మిందని చెప్పిన క్రాంతి గౌడ్
- ఎంపీలోని ఓ చిన్న గ్రామం నుంచి వచ్చి ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నానని వెల్లడి
- కుటుంబ సభ్యుల మద్దతు వల్లే ఈ స్థాయికి చేరానని స్పష్టీకరణ
- ప్రపంచకప్‌లో రాణించడంతో తన గ్రామంలో క్రికెట్ అకాడమీ ఏర్పాటైందని హర్షం
- తనను చూసి ఎందరో అమ్మాయిలు క్రికెట్‌లోకి రావడం గర్వంగా ఉందన్న క్రాంతి







**డిడి9 వార్త:**

టీమిండియా యువ ఫాస్ట్ బౌలర్ క్రాంతి గౌడ్ తన క్రికెట్ ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలను, కుటుంబ సభ్యులు చేసిన త్యాగాలను గుర్తుచేసుకుని భావోద్వేగానికి గురయింది. తన కోసం తన తల్లి ఏకంగా నగలు అమ్మి క్రికెట్ కిట్ కొనిచ్చిందని, వారి త్యాగాలను వృధా కానివ్వరాదనే పట్టుదలతోనే ఆడుతున్నానని ఆమె వెల్లడించింది. ఇటీవల జియోస్టార్‌తో మాట్లాడుతూ ఆమె తన స్ఫూర్తిదాయక ప్రస్థానాన్ని పంచుకుంది.

మధ్యప్రదేశ్‌లోని ఓ చిన్న గ్రామం నుంచి వచ్చిన తాను, అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేయడం అంత సులభంగా జరగలేదని తెలిపింది. శ్రీలంకలో దక్షిణాఫ్రికాతో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో వన్డే అరంగేట్రం చేసిన ఆమె, ఇంగ్లండ్ పర్యటనలో టీ20ల్లోకి అడుగుపెట్టింది. అదే పర్యటనలో ఒక మ్యాచ్‌లో 52 పరుగులకే 6 వికెట్లు పడగొట్టి సత్తా చాటింది.

**ఆడపిల్లలు బయటకే రాకూడదనేవారు..**

తన ప్రారంభ రోజుల గురించి క్రాంతి మాట్లాడుతూ.. "నేను క్రికెట్ ఆడతానని పెద్దగా కలలు కనలేదు. మాది ఒక చిన్న పల్లెటూరు. అక్కడ ఆడపిల్లలు స్వేచ్ఛగా బయటకు అడుగుపెట్టడమే కష్టం. అమ్మాయిలు బయటకు వస్తే లేదా ఏదైనా చేయాలని ప్రయత్నిస్తే, చుట్టుపక్కల వారి నుంచి విమర్శలు, హేళనలు ఎదుర్కోవాల్సిందే. కానీ కష్టపడి పనిచేసే వారు ఎప్పటికీ ఓడిపోరని నేను నమ్మాను. అందుకే నా పని నేను చేసుకుంటూ పోయాను. బౌలింగ్ చేస్తూ, నేర్చుకుంటూ, నన్ను నేను నమ్ముతూ ముందుకు సాగాను. ఈ రోజు నేను టీ20 ప్రపంచకప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరుకున్నాను. ఈ జెర్సీ ధరించి ఈ పెద్ద వేదికపై నిలబడినప్పుడు, నేను పడిన కష్టాలన్నీ మరిచిపోతాను" అని తెలిపింది.

**కుటుంబం మద్దతే నా బలం**

కుటుంబం అందించిన మద్దతు గురించి ఆమె వివరిస్తూ.. "మీ కుటుంబం మీకు అండగా నిలిస్తే, బయటివాళ్లు ఏమనుకున్నా ఫర్వాలేదు. ఎందుకంటే వారు మనకు ఏ విధంగానూ మద్దతు ఇవ్వరు. నేను క్రికెట్ ఆడటం మొదలుపెట్టిన రోజుల్లో చాలా మంది అమ్మాయిలను బయటకు కూడా రానిచ్చేవారు కాదు. కానీ నా తల్లిదండ్రులు అలా కాదు. నా కుటుంబంలో ప్రతి ఒక్కరూ నాకు అండగా నిలిచారు. నేను ఏదో తప్పు చేస్తున్నాననే భావనను ఎప్పుడూ కలిగించలేదు. నా కలను వాళ్లు నమ్మారు. ఆ మద్దతే నాకు బలాన్నిచ్చింది" అని క్రాంతి చెప్పింది.

ఆమె ఇంకా మాట్లాడుతూ.. "ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఉండేవి. మ్యాచ్‌లు ఆడేందుకు వెళ్లాలంటే డబ్బులు సరిపోయేవి కావు. ఆ సమయంలో మా అమ్మ తన నగలు అమ్మి నాకు ఒక మంచి క్రికెట్ కిట్ కొనిచ్చింది. అది చాలా పెద్ద త్యాగం. నా కుటుంబం నా కోసం ఇంత చేస్తున్నప్పుడు, వారికి ఏదైనా తిరిగి ఇవ్వాలనే బాధ్యత నాపై పెరిగింది. వారి త్యాగాన్ని సార్థకం చేయాలని నిర్ణయించుకున్నాను" అని భావోద్వేగంగా వెల్లడించింది.

**గ్రామంలో క్రికెట్ అకాడమీ..**

ప్రపంచకప్‌లో తన ప్రదర్శన కారణంగా, తన సొంత గ్రామమైన ఘువారాలో ఇప్పుడు ఒక క్రికెట్ అకాడమీ ఏర్పాటైందని క్రాంతి ఆనందం వ్యక్తం చేసింది. "నా ప్రదర్శన చూసి ఇప్పుడు మా ఊరిలో చాలా మంది అమ్మాయిలు క్రికెట్ ఆడేందుకు వస్తున్నారు. వారి తల్లిదండ్రులు కూడా తమ కుమార్తెలపై నమ్మకం ఉంచి, క్రీడల్లో కెరీర్ నిర్మించుకోవచ్చని భావిస్తున్నారు. ఇది నాకు చాలా గర్వకారణమైన క్షణం. ఒకప్పుడు బయటకు రావడానికే భయపడిన ఆ అమ్మాయిలు, ఇప్పుడు రోజూ ప్రాక్టీస్ చేస్తున్నారు. ఈ మార్పులో ప్రపంచకప్ విజయం కీలక పాత్ర పోషించింది" అని ఆమె పేర్కొంది.

## ఏ కలతో అయితే నేను బ్యాట్ పట్టుకున్నానో.. ఆ కల ఇప్పుడు నెరవేరింది: వైభవ్ సూర్యవంశీ

- 15 ఏళ్లకే టీమిండియాకు ఎంపికైన యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ
- సచిన్ టెండూల్కర్ 36 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన యువ క్రికెటర్
- ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు ఆసియా క్రీడల జట్టులో చోటు
- టీమిండియా జెర్సీ చూసి మాటల్లో చెప్పలేని ఆనందం కలిగిందన్న వైభవ్
- తన కల నెరవేరిందంటూ యువ బ్యాటింగ్ కెరటం భావోద్వేగం




**డిడి9 వార్త:**

భారత క్రికెట్‌లో సరికొత్త సంచలనం నమోదైంది. కేవలం 15 ఏళ్ల 71 రోజుల వయసులోనే యువ బ్యాటింగ్ కెరటం వైభవ్ సూర్యవంశీ భారత టీ20 జట్టుకు ఎంపికై చరిత్ర సృష్టించాడు. ఈ ఎంపికతో 36 ఏళ్ల క్రితం క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ నెలకొల్పిన రికార్డు బద్దలైంది. రాబోయే ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు 2026 ఆసియా క్రీడలకు ప్రకటించిన భారత జట్టులో వైభవ్‌కు చోటు దక్కింది.

1989లో సచిన్ టెండూల్కర్ 16 ఏళ్ల 205 రోజుల వయసులో భారత జట్టులోకి అరంగేట్రం చేసి, అతి పిన్న వయసులో అంతర్జాతీయ క్రికెట్ ఆడిన భారత ఆటగాడిగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు వైభవ్, అంతకంటే తక్కువ వయసులోనే జాతీయ జట్టుకు ఎంపికై ఆ రికార్డును అధిగమించాడు. రాబోయే పర్యటనల్లో అతను తుది జట్టులో ఆడితే, భారత్ తరఫున అంతర్జాతీయ క్రికెట్ ఆడిన అత్యంత పిన్న వయస్కుడిగా మరో అరుదైన ఘనత సాధిస్తాడు.

**ఆ ఆనందం మాటల్లో చెప్పలేనిది..**

భారత జట్టుకు ఎంపికైన సందర్భంగా బీసీసీఐ పంచుకున్న వీడియోలో వైభవ్ సూర్యవంశీ భావోద్వేగానికి గురయ్యాడు. టీమిండియా జెర్సీని అందుకున్న క్షణాలను వివరిస్తూ.. "ఈ అనుభూతిని మాటల్లో చెప్పలేను. ఏ కలతో అయితే నేను బ్యాట్ పట్టుకొని ప్రాక్టీస్ మొదలుపెట్టానో, ఆ కల ఇప్పుడు నెరవేరింది. నా జీవిత ప్రయాణంలో అతి పెద్ద అడుగు ఈ రోజే పూర్తయింది. ఆ టీషర్ట్‌ను చూసినప్పుడు కలలో ఉన్నట్లు అనిపించింది. ఆగకుండా నవ్వుతూనే ఉన్నాను. కొన్నిసార్లు మనం ఊహించనివి జరిగినప్పుడు ఎలా స్పందించాలో కూడా తెలియదు. నాకు సరిగ్గా అలాగే అనిపించింది" అని తన ఆనందాన్ని పంచుకున్నాడు.

భారత జట్టు షెడ్యూల్ ప్రకారం.. జూన్ 26, 28 తేదీల్లో ఐర్లాండ్‌తో రెండు టీ20లు, ఆ తర్వాత జులై 1 నుంచి 11 వరకు ఇంగ్లండ్‌తో ఐదు టీ20లు ఆడనుంది. సెప్టెంబర్ 24 నుంచి ఆసియా క్రీడల్లో పురుషుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది.

DD9 వార్త
తెలుగు దినపత్రిక
DD9 Vaartha
బుధవారం
24-06-2026
హైదరాబాద్

# 'బార్డర్ 3'కి సిద్ధం!



1971 నాటి భారత్ పాకిస్థాన్ యుద్ధ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బార్డర్ 2'. సన్నీ డేల్ ప్రధాన పాత్రలో నటించిన ఈ చిత్రం ఈ ఏడాది ప్రారంభంలోనే విడుదలై ప్రేక్షకుల్ని అలరించింది. ఇప్పుడు దీనికి సీక్వెల్‌గా మూడో భాగం రాబోతున్నట్లు జేపీ దత్తా కుమార్తె, నిర్మాత నిధి దత్తా అధికారికంగా వెల్లడించారు. దీంతో పాటు 1965 ఇండోపాకిస్థాన్ యుద్ధ సమయంలో భారత సైన్యానికి నాయకత్వం వహించిన యుద్ధ వీరుడు జనరల్ హర్‌బక్ష్ సింగ్ జీవిత చరిత్ర ఆధారంగా ఓ చిత్రం, ఆపరేషన్ సిందూర్ సమయంలో జరిగిన పరిస్థితుల నేపథ్యంలో మరో సినిమా, నిధి వేటకు సంబంధించిన ఓ యాక్షన్ అడ్వెంచర్‌తో పాటు.. తన తాత చిత్రనిర్మాత ఓపీ దత్తాపై ఓ సిరీస్‌ను తెరకెక్కించబోతున్నట్లు.. మొత్తంగా ఐదు ప్రాజెక్టుల్ని ప్రకటించారు. జేపీ ఫిల్మ్స్ నిర్మాణంలో రాబోతున్న ఈ చిత్రాల షూటింగ్ మరో రెండు నెలల్లో ప్రారంభమయ్యే అవకాశం ఉందని, త్వరలోనే వీటికి సంబంధించిన అధికారిక ప్రకటనలు వెలువడతాయని నిధి దత్తా తెలిపారు.

# నా కష్టాలకు ప్రతిఫలం అందుకునే దశలో ఉన్నా!

సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చినప్పటికీ.. ప్రేక్షకులు ఎప్పుడూ మన కష్టాన్ని చూసే ఆదరిస్తారని రామ్ చరణ్ (Ram Charan) అన్నారు. తాజాగా ఆయన 'రిపబ్లిక్ సమ్మిట్'లో పాల్గొని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. బిజినెస్ భాషలో చెప్పాలంటే.. 'పెద్ది' సినిమా తన కెరీర్‌కు బెస్ట్ 'స్టార్టప్' లాంటిదని వెల్లడించారు.

"నా చిన్నప్పుడు దర్శకులు, నిర్మాతలు 'మీ నాన్న కంటే బాగా చేయాలి' అని చెప్పినప్పుడు బాధ్యతగా అనిపించేది. నేను ఆ ఒత్తిడిని పెద్దగా పట్టించుకోలేదు. మా నాన్న (Chiranjeevi) ఇంట్లో సరదాగా ఉంటారు. మా డైనింగ్ టేబుల్ మీద సినిమా చర్చలు, స్టార్డమ్ ముచ్చట్లు ఎప్పుడూ రానిచ్చేవారు కాదు. సినిమా నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి రావడం వల్ల త్వరగా ఒక మంచి వేదిక దొరుకుతుందనేది నిజమే.. కానీ, ప్రేక్షకులు మనల్ని ఎవరి వారసుడు అని చూడరు.. మొదటి సినిమా తర్వాత కేవలం మన కష్టం, నిజాయతీ మాత్రమే చూస్తారు. నా 15 ఏళ్ల కెరీర్‌లో ఆయన నాకు ఎప్పుడూ నటన పరంగా ఫీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. నన్ను వేలు పట్టి నడిపించలేదు. కానీ క్రమశిక్షణ విషయంలో ఆయనే నాకు స్ఫూర్తి" అని చెప్పారు.

ఓటీటీల ట్రెండ్ గురించి మాట్లాడుతూ.. "థియేటర్లు, ఓటీటీలు రెండూ ఒకదానికొకటి సాయం చేసుకుంటూ ముందుకు సాగాలి. 'ఆర్ఆర్ఆర్' థియేటర్లలో విడుదలైన తర్వాత నెట్‌ఫ్లిక్స్‌లో అందుబాటులోకి వచ్చింది. దానివల్ల పాశ్చాత్య దేశాల ప్రజలకు కూడా సినిమా చేరి, ఆస్కార్ నామినేషన్ వరకు వెళ్లేలా క్రేజ్ పెరిగింది. జపాన్‌లో కూడా సోషల్ మీడియా బజ్ వల్లే రూ.65 కోట్లకు పైగా వసూళ్లు వచ్చాయి. భారతదేశంలో ఇప్పటికీ ఒక కుటుంబానికి అత్యంత తక్కువ ఖర్చుతో దొరికే వినోదం సినిమానే. థియేటర్లలో పాప్‌కార్న్ ధరలు కాస్త తగ్గితే ఇంకా బాగుంటుంది. సినిమా అనేది ఓ భావోద్వేగం.. అది ఎప్పటికీ అలానే ఉంటుంది. దేశభక్తి కథలకు ఎప్పుడూ ప్రాధాన్యతనివ్వాలి. ఒక సినిమా రూ.500 కోట్లు లేదా రూ.800 కోట్లు వసూలు చేస్తోందంటే, దానర్థం దేశంలోని ప్రజలు ఆ కథను తమ సొంత కథగా భావించి ఆదరిస్తున్నారనే. దేశాన్ని ఏకం చేసే ఇలాంటి సినిమాలు రావడం గొప్ప విషయం" అని రామ్ చరణ్ తెలిపారు.



# ధనుష్‌తో శ్రీలీల స్టెప్పులు?

ఓ వైపు నటన.. మరోవైపు అదిరిపోయే స్టెప్పులతో కుర్రకారుని ఉర్రూతలూగిస్తోంది అందాల తార శ్రీలీల. ఇప్పుడీమె మరోసారి తన స్టెప్పులతో తెరపై మ్యాజిక్ చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ధనుష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఓం'. రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కథానాయికలుగా శ్రీలీల, సాయిపల్లవి నటిస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇందులో భాగంగానే తాజాగా ఈ చిత్రంలో ధనుష్, శ్రీలీల కాంబినేషన్‌లో వచ్చే ఓ పాట షూటింగ్ కోసం చెన్నైలో భారీ సెట్‌ను ఏర్పాటు చేసినట్లు సమాచారం. 'మారి 2'లోని 'రౌడీ బేబీ..' పాట తరహాలో ఉత్సాహభరితమైన డ్యాన్స్ స్టెప్పులతో ఈ గీతాన్ని తీర్చిదిద్దుతున్నట్లు, ఇందులో ధనుష్‌తో శ్రీలీల వేసే చిందులు సినిమాకే ప్రధాన ఆకర్షణగా ఉండనున్నాయని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఎర్రచందనం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తున్నారు.



# విజయ్‌ను అన్‌ఫాలో చేసిన త్రిష.. నెట్టింట కొత్త చర్చ!

కొన్ని నెలలుగా సోషల్ మీడియాలో విజయ్ త్రిష పేర్లు వైరలైన విషయం తెలిసిందే. వీరిద్దరూ రిలేషన్‌లో ఉన్నారని వార్తలు వచ్చాయి. తాజాగా వీరిద్దరూ విడిపోయారని ప్రచారం జరుగుతోంది. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. విజయ్ సీఎం అయ్యాక తొలి పుట్టినరోజు కావడంతో త్రిష (Trisha) విషెస్ కోసం అందరూ ఎదురుచూశారు. ప్రతి సంవత్సరం ఆయనకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపే త్రిష మాత్రం ఈసారి ఎలాంటి పోస్ట్ పెట్టకపోవడంతో నెట్టింట కొత్త చర్చ ప్రారంభమైంది. కొన్నేళ్లుగా విజయ్ (Vijay) పుట్టినరోజున ఆయనతో కలిసి దిగిన అరుదైన ఫొటోలను త్రిష పంచుకునేవారు. కానీ, ఈసారి ఆమె మౌనంగా ఉండడంతో పాటు.. ఇన్‌స్టాగ్రామ్‌లో విజయ్‌ను అన్‌ఫాలో చేశారు. దీంతో ఈ అంశంపై నెట్టింట చర్చ జరుగుతోంది.



# ఈసారి యాక్షన్ బాటే!

షారుక్ ఖాన్ 'జవాన్' సినిమాతో హిందీలోకి తొలి అడుగు వేసింది నటి నయనతార. అందులో ఆమె యాక్షన్ ప్రాధాన్యమున్న పాత్రతో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తను సల్మాన్ ఖాన్ చిత్రంతో మరోసారి హిందీ ప్రేక్షకుల్ని పలకరించేందుకు సిద్ధమవుతోంది. అయితే ఈసారి కూడా ఆమె కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా యాక్షన్‌తోనూ అదరగొట్టనుందని సమాచారం. ఇటీవలే ఈ సినిమాకి సంబంధించిన కీలక షెడ్యూల్‌ని పూర్తి చేయగా.. నయన్‌పై కొన్ని పోరాట సన్నివేశాల్ని చిత్రీకరించినట్లు తెలిసింది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాని వంశీ పైడిపల్లి తెరకెక్కిస్తున్నారు. శ్రీ వేంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు నిర్మిస్తున్నారు. ఇది వచ్చే ఏడాది రంజాన్‌కి ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశముంది.



# మాలీవుడ్ ఇండస్ట్రీకి భాగ్యశ్రీ బోర్సే ఎంట్రీ..



టాలీవుడ్ యంగ్ హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే చేసిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేకపోయాయి. అయినప్పటికీ ఈ భామ క్రేజ్, డిమాండ్ ఏ మాత్రం తగ్గలేదు. టాలీవుడ్‌లో వరుసగా క్రేజీ ఆఫర్లు దక్కించుకుంటూ అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. తెలుగుతో పాటు 'కాంత' అనే సినిమాతో తమిళ ఇండస్ట్రీలోకి కూడా అడుగుపెట్టింది. ఇటీవల 'ఆంధ్రా కింగ్ తాలూకా' చిత్రంతో ప్రేక్షకులను అలరించిన భాగ్యశ్రీ.. ప్రస్తుతం కోలీవుడ్ స్టార్ శివకార్తికేయన్ సరసన 'సెయాన్' సినిమాలో నటిస్తూ ఫుల్ బిజీగా ఉంది. అలాగే తెలుగులో అక్కినేని అఖిల్ నెక్స్ట్ మూవీ 'లెనిన్'లో హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ క్రమంలోనే భాగ్యశ్రీ బోర్సేకు సంబంధించిన వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. టాలీవుడ్, కోలీవుడ్ తర్వాత ఈ బ్యూటీ ఇప్పుడు మాలీవుడ్ ఇండస్ట్రీలోకి కూడా గ్రాండ్‌గా ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు టాక్ నడుస్తోంది.

మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్ నటిస్తున్న ఒక భారీ బడ్జెట్ సినిమాలో భాగ్యశ్రీ ఒక కీలకమైన పాత్రకు ఎంపికైనట్లు సమాచారం. టాలెంటెడ్ డైరెక్టర్ విష్ణు మోహన్ దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఒక హైవోల్టేజ్ సర్వైవల్ థ్రిల్లర్ చిత్రంలో ఆమె నటించనుందనే వార్త నెట్టింట వైరల్ అవుతోంది. ఈ సినిమా కథాంశం చాలా పవర్‌ఫుల్‌గా ఉండబోతోందని తెలుస్తోంది. రష్యాఉక్రెయిన్ యుద్ధం జరిగిన సమయంలో అక్కడ చిక్కుకుపోయిన భారతీయ పౌరులను, విద్యార్థులను సురక్షితంగా స్వదేశానికి తీసుకురావడం కోసం భారత ప్రభుత్వం చేపట్టిన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీక్రెట్ మిషన్ ఆపరేషన్ గంగ నేపథ్యంలో ఈ సినిమా కథ సాగనుంది. ఇంతటి భారీ దేశభక్తి చిత్రంలో భాగ్యశ్రీ బోర్సేకి ఒక ఇంపార్టెంట్ రోల్ దక్కడం విశేషం. ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ ఆగస్టు మొదటి వారంలో జార్జియాలో ప్రారంభం కానుందని తెలుస్తోంది.

# ఈ అనుభూతిని నేను జీవితాంతం మర్చిపోలేను..

యంగ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్ 'సీతారామం' సినిమాతో ఓవర్ నైట్ స్టార్‌గా మారిపోయారు. ఆ తర్వాత తెలుగులో పలు చిత్రాల్లో నటించిన ఆ భామ ఫుల్ క్రేజ్ రాబట్టుకున్నారు. తన యాక్టింగ్, అందం, అభినయంతో ప్రశంసలు పొందుతూ ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. ఇక మృణాల్ ఇటీవల నటించిన సినిమా 'డెకాయిట్'. ఇందులో ఆమె యాక్టింగ్‌కు ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. అయినప్పటికీ ఈ మూవీ మాత్రం బాక్సాఫీసు వద్ద హిట్ అందుకోలేకపోయింది. ప్రస్తుతం మృణాల్ ఖాతాలో ఎలాంటి ప్రాజెక్ట్ లేకపోవడంతో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ పలు పోస్టులు షేర్ చేస్తున్నారు. తమ్ముడి గ్రాడ్యుయేషన్ కోసం అమెరికా వెళ్లిన మృణాల్.. సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. "నా హృదయం సంతోషంతో నిండిపోయింది. నా కలల్లో ఒకటి నిజమవ్వడం.. అది కూడా నువ్వు అంత సులువుగా సాధించడం కళ్లారా చూడటం చాలా ప్రత్యేకమైన అనుభూతి. నిన్ను చూస్తే నాకు చాలా గర్వంగా ఉంది. నువ్వు ఎదుగుతున్న తీరు, నిజంగా నువ్వు ఎంత మంచి అబ్బాయివో, మనసున్న వాడివో చూస్తుంటే ముచ్చటేస్తోంది. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినందుకు అభినందనలు బేటా. నీ భవిష్యత్తు చాలా అద్భుతంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. నిజం చెప్పాలంటే.. నాకేదో సినిమా సీన్‌లో ఉన్నట్లు అనిపించింది. హేహే.. ఆ గ్రాడ్యుయేషన్ వేడుక అంత అందంగా జరిగింది.. ఈ అనుభూతిని నా జీవితాంతం మర్చిపోలేను" అని రాసుకొచ్చారు.



This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502520.